
# మిసిమి

మాస పత్రిక

అక్టోబరు, 1993
వెల రూ.5/-





కర్నాటక రాష్ట్రంలో 'శ్రావణ బెలగోల' లోని

గోమతేశ్వర జైనముని

ఎత్తు: 57 అడుగులు

# మిసిమి

**"All that we are is the product of what we have thought," is "We are what we think." – Dammapada.**


సంపుటి 5 | అక్టోబరు 1993 | సంచిక 3

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి


## విషయసూచిక


ఆధునిక తాత్త్వికుడు
కృష్ణచంద్ర భట్టాచార్య – శివలింగం

ధోరణి – డా. సంజీవదేవ్

ఆంగ్ల పత్రికా ప్రపంచంలో – డా. డి. ఆంజనేయులు

తెలుగు సాహిత్యంలో – ఆర్.ఎస్. సుదర్శనం

సంస్కృత రూపకములు – డా. పోణంగి శ్రీరామ అప్పారావు



విడిప్రతి రూ. 5/- వార్షిక చందా రూ. 60/-


ముఖచిత్రం

నిరీక్షిస్తున్న రాధ

కాంగ్రా వర్ణచిత్రం

అనివార్య కారణాలవల్ల ఈ సంచికలో పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారి వ్యాసం ప్రచురించ లేకపోవుచున్నాము.


Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Kiss**, *n.* A word invented by the poets as a rhyme for "bliss." It is supposed to signify, in a general way, some kind of rite or ceremony appertaining to a good understanding; but the manner of its performance is unknown to this lexicographer.

**Kleptomaniac**, *n.* A rich thief.

**Labor**, *n.* One of the processes by which A acquires property for B.

**Language**, *n.* The music with which we charm the serpents guarding another's treasure.

**Last**, *n.* A shoemaker's implement, named by a frowning Providence as opportunity to the maker of puns.

Ah, punster, would my lot were cast,
Where the cobber is unknown
So that I might forget his last
And her your own.

*Gargo Repsky.*

**Laurel**, *n.* The laurus, a vegetable dedicated to Apollo, and formerly defoliated to wreath the brows of victors and such poets as had influence at court.

**Lawful**, *adj.* Compatible with the will of a judge having jurisdiction.

**Lawyer**, *n.* One skilled in circumvention of the law.

**Laziness**, *n.* Unwarranted repose of manner in a person of low degree.

**Learning**, *n.* The kind of ignorance distinguishing the studious.

**Lecturer**, *n.* One with his hand in your pocket, his tongue in your ear and his faith in your patience.

**Legacy**, *n.* A gift from one who is legging it out of this vale of tears.

**Liar**, *n.* A lawyer with a roving commission.

**Liberty**, *n.* One of Imagination's most precious possessions.

The rising People, hot and out of breath,
Roared round the palace: "Liberty or death!"
"If death will do," the King said, "let me reign;
You'll have, I'm sure, no reason to complain.

*Martha Braymance.*

**Lighthouse**, *n.* A tall building on the seashore in which the government maintains a lamp and the friend of a politician.

**Linen**, *n.* "A kind of cloth the making of which, when made of hemp, entails a great waste of hemp." – *Calcraft the Hangman.*

**Litigant**, *n.* A person about to give up his skin for the hope of retaining his bones.

**Litigation**, *n.* A machine which you go into as a pig come out of as a sausage.

**Lock-and-key**, *n.* The distinguishing device of civilization and enlightenment.

**Lodger**, *n.* A less popular name for the Second Person of that delectable newspaper Trinity, the Roomer, the Bedder and the Mealer.

# ఆధునిక తాత్త్వికుడు
# కృష్ణచంద్ర భట్టాచార్య

## 'అద్వైత సిద్ధాంత నిర్మాణంలో 'బ్రహ్మ'ను Idea of the Reason గా మలచుట సాధ్యమే'

**- శివలింగం**

పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్ధంలో రామకృష్ణుడు, వివేకానందుడు, రవీంద్రుడు తరవాత తిలక్, గాంధీలతో భారతీయ తత్వశాస్త్రం ఒక వినూతన శైలితో భాషలో, ఆలోచనలో బౌద్ధికంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది.

Intellectual Language, జ్ఞాన మీమాంస, తర్కం అరవిందునిలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి.

రాధాకృష్ణన్, హిరియన్నలు భారతీయ తత్వశాస్త్రాన్ని ఆధునిక పాశ్చాత్యదేశాలకు తులనాత్మక అధ్యయనంచేసి వ్యాఖ్యానించినవారు. వ్యాఖ్యాతలేగాని Original Philosophy, వారిదైన ఒకనూతన తాత్విక ధోరణిగాని సిద్ధాంతంగాని ప్రతిపాదించలేదు. సురేంద్రనాథ్ దాస్‌గుప్త తత్వశాస్త్ర చరిత్రరాసి లోటుతీర్చాడు. చంద్రధరశర్మ తత్వశాస్త్ర గ్రంథంలో సంస్కృతమూలాలు యివ్వడం విశేషం. అంతేగాక లోపాలనుకూడా వివరించడం జరిగింది.

ప్రాచీన భారతీయ తత్వశాస్త్ర భాష్యకర్తలే అందరూ. తాత్వికుడైనవాడు ఆనాటి తత్వశాస్త్ర సిద్ధాంత పునాదులమీద ఒక నూతన సిద్ధాంతాన్ని నిర్మించాలి. పాశ్చాత్య తత్వశాస్త్రం ఆవిధంగా ఎవరికివారు ఒక కొత్త సిద్ధాంత నిర్మాతలుగా నిలబడ్డారు.

ఆధునిక తత్వశాస్త్రం గురించి మంచిగ్రంథం రాసిన ఫాల్కెన్‌బర్గ్ యిలా అంటాడు: Modern Philosophy is anti-scholastic, humanistic and naturalistic. భారతీయ తత్వశాస్త్రం ఆస్థాయిని అందుకోగలిగిందా? అనేది ప్రశ్న. భారతీయ తత్వశాస్త్రం దర్శన శాస్త్రం. అనుభవాన్ని హేతుబద్ధంగా చెప్పడం తత్వశాస్త్రం (Philosophy is the rationalisation of Experience). పాశ్చాత్య తత్వశాస్త్రంలో ఎపిస్టమాలజి, మెటాఫిజిక్సు అనే విశాల విభజనవుంది. భారతీయ తత్వశాస్త్రంలో మతం, శాస్త్రం కలిశాయి. అందుకే భారతీయ విభిన్న తాత్వికధోరణులు అనడం మిథ్య అంటున్నారు. Schools of thought or philosophy ఒక కల్పన అని దయాకృష్ణ అంటున్నారు. భారతీయ తత్వశాస్త్రంలోలా ఆధునికుడైన అరవిందునిలో అన్నీ కలిశాయి. అరవిందుని నూతనత్వం ఏమిటి అంటే అదీ అద్వైతమే కాదంటే పూర్ణాద్వైతం అన్నారు. ఆంగ్లంలో రాయడంవలన ఖండాంతర కీర్తి పొందాడు. జగత్తు మిథ్య అనలేదు. భౌతిక చైతన్యాన్ని గుర్తించాడు. అతీతశక్తి ఈ లోకంమీదకు తీసుకురావాలని తపించాడు.

హిందూమతాన్ని ఒక జీవన విధానంగా, సజీవసంప్రదాయంగా, నిర్దిష్టమూ, సటిష్టమూ అయిన ఆలోచనాపద్ధతిగా గుర్తించి స్వతంత్రాలోచనా దృక్పథంతో భారతీయ తత్వశాస్త్రాన్ని వ్యాఖ్యానించినవాడు కృష్ణచంద్ర భట్టాచార్య (1875-1949). పాశ్చాత్యుల విమర్శనాత్మక విశ్లేషణ, హేతువాదం వారి ఆలోచనకు నూతనత్వం చేకూర్చాయి.

**రస తత్వం :** భరతుడు రస సిద్ధాంతాన్ని రంగస్థల నాటకానికి, కవిత్వానికి కళకు వర్తింపచేశాడు. రసం పదం అధర్వణవేదం నుండి స్వీకరించాడు (రసాన్ అధర్వణాదపి). అనాటినుండి భట్టనాయకుడు, అభినవగుప్తుడు, విశ్వనాథుడు, మమ్మటుడు, జగన్నాథుడు వంటి ఆలంకారికులందరూ రస సిద్ధాంతాన్ని ప్రవచించినవారే. రసాన్ని గురించి మన ఆలంకారికులంతా ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరచలేదు. రసం ఆస్వాద వస్తువుగా భరతుడు ప్రతిపాదించాడు. అనువ్యవసాయం, ప్రత్యభిజ్ఞ అనేవి భౌతిక వస్తువులు కావు. ఆలోచనా ప్రపంచానికి సంబంధించినవి. అభినవ గుప్తుడు రసం విజ్ఞాన వాదావలంబనాత్ అన్నాడు. జ్ఞేయ, జ్ఞానాలకు వున్న భేదమే ఆస్వాద్య - ఆస్వాద పదాలకు కూడా. ఆధునిక కాలంలో కూడా ఈభేదం అలాగే కొనసాగించారు. రసాన్ని ఆస్వాదంగానేగాక ఆనందం, సౌందర్యం పదాలకు సమానార్థకంగా భావించారు శంకరన్, రాఘవన్, నాగేంద్ర వంటి ఆలంకారిక విమర్శకులు.

ఈ చారిత్రక నేపథ్యంలో ఆధునిక తాత్వికుడు కృష్ణచంద్ర భట్టాచార్య రసం గురించి ఏమి చెప్పాడో పరిశీలించవచ్చు. భట్టాచార్య రస సిద్ధాంత వివరణనుబట్టి భరతుని నుంచి జగన్నాథుని వరకు జరిగిన అభివృద్ధిని సులభంగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది.

రసానికి రెండర్థాలు : 1. సారాంశము (Essence) 2. రుచి (Which is either tasted or felt) ఆస్వాదం. ఈ రెండర్థాలు రసంలో కలిసేవున్నాయి.

రసానుభూతి శాశ్వతం - అనుభూతి సారం - మళ్లీ అనుభూతి పొందడానికి వస్తువు అవుతుంది. శాశ్వత రసాత్మక విలువగా నిలబడుతుంది.

'కవిచేసే ఆత్మికసాధన చేతనే ఈద్విధారూప ఏకత్వ జ్ఞానాన్నిచ్చే (తాదాత్మ్యాన్నిచ్చే) హృదయ సంవాదం సిద్ధిస్తుంది.

సారాంశం మేధాసంబంధీ కాదు, తర్క-సంబంధీ కాదు. తార్కిక జగత్తు ఆదర్శ జీవిత సంబంధి. రస జగత్తు అనుభూతి సంబంధి. రసం భావమూకాదు. విశ్వజనీన సత్యమూకాదు. అది ప్రత్యక్షంకాదు. అనుభవంద్వారా అర్థం చేసుకోవాలి. కళాత్మకానుభూతిలో మేధకు తావులేదు. అందుకే కళానుభూతికి మూల్యంగా కనిపించేది మేధకు అమూల్యంగా కనిపించ వచ్చు. అనుభూతిదే ప్రాధాన్యత. భట్టాచార్యమీద కాంట్, భట్టనాయకుడు, అభినవగుప్తుల ప్రభావం వుంది. భట్టనాయకుడు రెండర్థాల్లో రసపదాన్ని ఉపయోగించాడు. ఏకవచనంలో స్థాయి, విలువ. బహువచన ప్రయోగంలో దృష్టాంతం. ఆస్వాదించబడుతుంది గనుక రసం అన్నారు.

రసానుభవాన్ని మూడు దశలుగా పేర్కొన్నాడు భట్టాచార్య.

1. ప్రాథమికానుభవం 2. సానుభవం 3 సమాధ్యనుభవం.

రసానుభవాన్ని ఇతర అనుభవాలనుండి వేరు చేశాడు. స్థాయి భావంలో వస్తువును చూచినపుడు కలిగే అనుభవం వరకే. పిల్లవాడు బొమ్మతో ఆడుకునే స్థితి వంటిది.

భరతుడుకూడా స్థాయి భావాలకు, కవ్యంతర్గత భావాలకు వున్న భేదం చూపాడు. మంచి కవిత్వంలో జ్ఞాత, జ్ఞేయ భావం చెరిగిపోతుంది. హృదయ సంవాదంవలన కవిలో వస్తువు కలిగించే ఉద్వేజన తత్ఫలితమైన నిర్మగ్నత. Sympathy is not affected by the direct feeling. వాస్తవికతనుండి సింపతి వేరవుతుంది.

ఈ స్థితిని గురించి చెపుతూ రెండు దృష్టాంతాలిచ్చాడు.

1. భయంకర దృశ్యాన్ని చూచినవాడు తన అనుభవం చెప్పినప్పుడు వినేవాడికి ప్రత్యక్ష ప్రమేయం వుండదు.

2. బిడ్డ బాధల్నిగురించి తల్లి శోకిస్తుంది. బంధువు ఆమెకు సానుభూతి తెలుపుతాడు. ఆమె శోకంతో తాదాత్మ్యం పొందలేదు.

ఈ స్థాయిలో రసానుభూతి కలగదు. వస్తు గుణం యింకా సౌందర్యంగా రూపొందలేదు. ఇది రెండోదశ. మూడోదశ తద్భావ్యభావనం. Sympathy with Sympathy. భట్టనాయకుని సాధారణీకరణ ప్రభావం, జేమ్సువార్డు రాసిన సైకాలజి ఆఫ్ సెన్సేషన్ అండ్ ఫీలింగ్సు గ్రంథ ప్రభావమూ వున్నాయి. భారతీయకళ సృజనాత్మకంకాదు contemplative అన్నాడు. రస సౌందర్యం శుద్ధమైనది. అది విశ్వజనీనం కావాలి. రసం ఆత్మ పరిపూర్ణమేగాని వస్తుపరిపూర్ణం కాదు. భట్టనాయకుడు అభినవగుప్తుడు రససిద్ధాంతం గురించి చెప్పిన వాటినే మరింత విపులీకరించాడు భట్టాచార్య.

**వేదాంతం :** ఇంద్రియాలతో చూచేది ప్రత్యక్షం. దీన్ని వేదాంతులు ప్రపంచమన్నారు. దీనికి భిన్నమయింది బ్రహ్మ. చర్మ చక్షువులకు అగోచరం. ఉపనిషత్తులలో బ్రహ్మను, సత్యం, జ్ఞానం, ఆనందం, అనంతంగా అభివర్ణించారు. అద్వైత సిద్ధాంత నిర్మాణంలో బ్రహ్మను Idea of the reasonగా వర్ణించడం సాధ్యమేనన్న విషయం ప్రథమంగా భట్టాచార్య తత్వంలో కనిపించింది. సర్వజ్ఞానానికి మూలం బ్రహ్మ. సాంఖ్యులూ, యోగులూ, అద్వైతులు, విశిష్టాద్వైతులు, నైయాయికులు ( బౌద్ధులు తప్ప) వేదాంతాన్ని ప్రబోధించారుగనుక వాటిన న్నిటిని సమన్వయపరచడం కనిపిస్తుంది. బ్రహ్మ సాక్షాత్కారం పొందాక భాష 'వాధిత' (Contradicted) మవుతుంది. బహ్మ సాక్షాత్కారానంతరంహి ఘటాదినాం వాధః ( వేదాంతప రిభాష) ద్వంద్వత్వం అధిగమించాక భాష మిథ్య. భాష సత్స్వరూపాన్ని పూర్తిగా యివ్వ లేదు. సూచిస్తుంది. శ్రుతులరూపంలో వున్నాయి అన్ని భాషలు. అద్వైత భావాలకు తర్కజ్యోతిని ప్రసాదించాడు. శ్రుతివాక్యాలకు విభిన్న అర్థాలు చెప్పుతారు. ప్రమాణాల ద్వారాకాదు విమర్శలద్వారానే అర్థం బోధపడుతుంది. ప్రమాణాలు విఫలమయ్యాయి. మీమాంస అవసరాన్ని నొక్కి చెప్పాడు. మీమాంస అంటే mutual criticism of the texts. మీమాంసను ఈ దృక్పథంలో వేదాంతంనుంచి విడదీయలేదు. స్వతః ప్రామాణ్యాన్ని (Intrinsic Validity) గౌరవించాడు. వేదవాక్యార్థాల విషయంలోకూడా ఇదే అనుసరించాడు. ఇది సంప్రదాయ అద్వైత పాఠ్యగ్రంథాలకు వ్యతిరేకం.

ఆత్మ మజిలీలు మూడుగా పేర్కొన్నాడు.

1. దేహాత్మ - దేహంతో కలసి వుంటుంది ఆత్మ

2. బుద్ధ్యాత్మ - ఈ దశలో రెండు భాగాలు. రూపము, ఆలోచన. ఆత్మ మానసిక జీవితంతో తాదాత్మ్యం చెందుతుంది.

3. ఆధ్యాత్మ - పై దానికి వ్యతిరేకమై నటువంటిది. నేను నేనేనని తెలుసుకోవడం. తాదాత్మ్యం చెందడం.

The self is known in the form 'I am I' which is an analytic Self Identity. ఆత్మ అంటే జాగ్రజ్జీవనం, స్వప్నాలు, స్వప్నరహిత నిద్ర, ఆనందం అని వ్యాఖ్యానించాడు. ఆత్మపామర అంటే అధమస్థితి - తెలుసుకోవలసిన వస్తువును మరచిపోవడం.

ఆనందస్థితిలో ఆత్మ అస్తిత్వాన్నే నిరాకరిస్తుంది. అది శుద్ధాత్మ స్థితి. నేనులేకపోవడమే పరిపూర్ణత (absolute). అద్వైతుల తత్వమసిని అంగీకరించాడు. 'నేను'ను మాటల్లో చెప్పవచ్చు. పూర్ణత్వాన్ని చెప్పలేం. అది అనంతం. అనిర్వచనీయం.

వారి దృక్పథంలో మానవుడు free subject.

పూర్ణత్వం Subject as freedom.

శరీరం బ్రహ్మకు వివర్తం. ఆత్మ సాక్షాత్కారంతో ఆత్మ, పరమాత్మతో విలీనమై, శరీరం తొలగిపోతుంది. నేను కరిగిపోయి అనంతంలో కలసిపోతుంది. భట్టాచార్య ప్రధానంగా వేదాంతి.

## అనేకాంతవాదం

అనేకాంతవాదం జైనుల సిద్ధాంతం. స్యాద్‌వాదం, సప్త భంగీనయ తార్కికసిద్ధాంతాలతో అనేకాంతవాదం ముడి పడివుంది. జగత్తు మిధ్య బ్రహ్మసత్యం అన్న అద్వైత వాదులకు, బుద్ధుడు ప్రవచించిన క్షణికవాదం శూన్యవాదాలకు మధ్యస్థంగా వుంటుంది అనేకాంతవాదం. శాశ్వతం ఎంత సత్యమో మార్పు అంతే సత్యం. అందుకని సత్త మార్పులేనిదికాదు. సృష్టి స్థితి లయనిబద్ధం. ద్రవ్యం శాశ్వతం. గుణాలు మారుతూవుంటాయి.

స్యాద్ అంటే బహుశా లేదా కదాంచిత్ లేదా ఏదో విధంగా అని అర్థాలు చెప్పారు. ఏదీ పూర్తిగా సత్యంకాదు. ప్రతిదీ పాక్షికంగా సత్యం. కుండవున్నది, కుండలేదు - అనే రెండు వాక్యాలకు ముందు బహుశ అనే పదాన్ని చేర్చి బహుశకుండ వున్నది, బహుశకుండ లేదు అన్నారు. ఒక వస్తువు స్వరూపాన్ని గురించి చెప్పే విధానాన్ని నయ అంటారు. వస్తువును ఏడురకాలుగా చెప్పవచ్చునన్నారు.

1. స్యాద్ అస్తి 2. స్యాద్‌నాస్తి 3. స్యాద్ అస్తిచ నాస్తిచ 4. స్యాద్ అవ్యక్తవ్యమ్ 5. స్యాద్ అస్తిచ అవ్యక్తమ్ 6. స్యాద్ నాస్తిచ అవక్తవ్యమ్ 7. స్యాద్ అస్తిచ నాస్తిచ అవక్తవ్యంచ.

అనేకాంతవాద తత్వం సమన్వయ సిద్ధాంతం. అహింసావాదాన్ని బౌద్ధిక స్థాయికి తెచ్చింది. అంతా శూన్యమని, జగత్తు మిథ్య అనే విపరీతాలకు మధ్యేమార్గంగా వీటన్నిటి సహాయంతో ఒక కొత్త తత్వాన్ని ప్రతిపాదించారు. బిమల్ కృష్ణ జైన తర్కానికి విశ్వాసపాత్రమైన వ్యాఖ్యానం చేశాడు. భట్టాచార్య దృక్పథం అందుకు భిన్నం. భౌతిక ఆధారవిషయాలు గురించి చెప్పలేదు. సత్యం అణువుకూ విశ్వానికి సంబంధించింది. రెంటి సంబంధం గురించి చెపుతూ వాటినుంచి సప్తభంగులను వివరించాడు. ఈ ఏడు విధాలుకూడా సత్యానికి వున్న ఏడు ముఖాలు. ఎనిమిదోది సాధ్యంకాదు. అనంతంతో తాదాత్మ్యం కుదరదు ఇక. అనేకాంతవాదం, వాస్తవిక వాదానికి భిన్నం కావడానికి కారణం భట్టాచార్య వ్యాఖ్యాన ఫలితమే. నిశ్చిత సత్యాల అనేకత్వాన్ని realism విశ్వసిస్తుందన్నాడు. అనేకాంత వాదం అనిశ్చిత సత్య సిద్ధాంతంగానే

గుర్తించాడు. శుద్ధవాస్తవికతావాదం ఆలోచనకు అనుభవానికి మధ్య భేదాన్ని అంగీకరించదు.

జ్ఞేయం, జ్ఞానం రెండూ జ్ఞాతకు చెందుతాయి. జ్ఞానం అనంతమైంది. అది అనుభవంలో తెలియబడేది. విభిన్న పద్ధతుల్లో ఆలోచించడానికి అనేకాంతవాదం అనిశ్చిత సత్యంగా భావించడం భట్టాచార్య చేసిన కొత్త ప్రయోగం.

## సాంఖ్యం - పురుష బహుత్వం

సాంఖ్యదర్శనకర్త కపిలుడు - సాంఖ్యదర్శనంలోని భావాలు అతిప్రాచీనాలు. వాటి ప్రభావం భారతీయ సాహిత్యంలో విస్తృతం. ఈశ్వర కృష్ణుని సాంఖ్య కారికలు 72 వున్నాయి. సాంఖ్య భావాలు కాలగర్భంలో కలిసిపోయాయని విజ్ఞాన భిక్షువు. శంకరుడు సాంఖ్య దర్శనాన్ని అచేతన కారణవాదం అని తన సూత్రభాష్యంలో చాలాసార్లు పేర్కొని అది తన సిద్ధాంతంతో పోరాడే ప్రధాన మల్లుడని చెప్పాడు. సాంఖ్య అద్వైత వేదాంతదర్శనాల్లో ఏకత్వ, బహుత్వాలు చూడండి.

| ఏకత్వం | బహుత్వం |
|---|---|
| శంకరుని ఆత్మ - బ్రహ్మ | సాంఖ్యంలో పురుష బహుత్వం |
| సాంఖ్యంలో ప్రకృతి | శంకరుని మాయ - అవిద్య |

సాంఖ్యంలోని పురుష బహుత్వం, శంకరునిలో ఏకత్వంగా మార్పుచెందాయి. శంకరుని మాయ, అవిద్య బహుత్వం సాంఖ్యంలో ప్రకృతి ఏకత్వం అయింది.

సాంఖ్యయోగ సంబంధాన్ని వాచస్పతి మిశ్రుడు బుద్ధి - పురుష సంబంధం ప్రతిబింబవాదం అనీ, విజ్ఞాన భిక్షువు అన్యోన్య ప్రతిబింబమన్నాడు. అద్వైత - సాంఖ్య సిద్ధాంతాలకు అన్యోన్య ప్రతిబింబం నిర్మాణ భేదాన్ని చూపుతుంది. పురుష స్వభావం బుద్ధిలో ప్రతిబింబిస్తుంది. సాంఖ్యంలో అసీమితం సీమితంలో అసీమితం. గోవులు అసీమితం. గోత్వం సీమితం. శుద్ధ చైతన్యం ప్రతిబింబించటంవలన మనస్సు అహంకారం వంటివి ఎలా పరిణామం చెందుతూ వచ్చాయో అటువంటి శుద్ధ చైతన్యమే పురుషుడు.

పురుషుని అనుభవం కొరకు ప్రకృతి ప్రవర్తిస్తుంది. పురుషునికైవల్య సాధన అంతిమ లక్ష్యమంటుంది కారిక. పురుష బహుత్వాన్ని చర్చిస్తూ చివరకు అంటాడు: అస్మితత్వం పోయాక పురుషునిలోని పురుష సామాన్యం తెలుస్తుంది. ముక్తాత్మ వైయక్తిక చేతనకాదు. వేదాంతంలో ముక్తిపొందాక వ్యక్తిత్వం లేదు. సాంఖ్యంలో బుద్ధిలోనే చైతన్యం వ్యక్తం. బుద్ధి అధిగమించాక ఆత్మ లేదు. వేదాంతం ఆత్మచైతన్యం అంది. పరిపూర్ణ చైతన్యం సాంఖ్యంలో అవ్యక్తం. సాంఖ్యంలో బుద్ధి, వేదాంతంలో ఆత్మ (self) ఒకటే. తెలుసుకున్నప్పుడు బుద్ధిగాని ఆత్మగాని లేవు. బుద్ధి ద్వారా ఆత్మ వ్యక్తిత్వాన్ని భ్రాంతిగా తెలుసుకోలేవు.

## మోక్షం లేక విముక్తి (Freedom)

విముక్తికి విభిన్న మార్గాలు. భట్టాచార్య మూడు భిన్న మార్గాలను గురించి చెప్పాడు. ఆత్మసాక్షాత్కారం ప్రకృతినుండి పురుష వివేకంగా చిత్రించింది సాంఖ్యం. పురుషుని విముక్తి

ప్రతిబింబ జ్ఞానం. ముక్తి పొందటంకాదు. వేదాంతుల మోక్షం ఆత్మ స్వ స్వరూపాన్ని తెలుసుకోవడం. అందుకు సాధన అవసరం. బంధన భ్రాంతి అని తెలుసుకోగలుగుతాడు. అయితే ఈ సాధనలో కర్మనుగాని భక్తినిగాని త్యజించనవసరం లేదు. భక్తిభావం, శరణాగతి రెండోమార్గం. క్రిష్టియన్ మిస్టిక్స్ మార్మిక అనుభూతితో మోక్షం గురించి చెప్పారు. యోగంగాని కాంట్ గాని మోక్షం అంటే సంకల్ప రాహిత్యం అన్నారు. చిత్తవృత్తిని నిరోధించ మని యోగం. మోక్షానికి చివరిది ఉన్నతమైనది ఆధ్యాత్మికం. బౌద్ధికంకాదు. ఆధ్యాత్మిక విముక్తిలో భోగం నిలిచిపోతుంది. నివృత్తి స్థానమాక్రమిస్తుంది. విముక్తుడైనవాడు భావం లోనూ, భాషలోనూ, అన్నిటిలోనూ విముక్తుడే. భట్టాచార్య చెప్పిన ముఖ్యాంశం విముక్తుడికి మార్గస్వభావం గురించి ఆలోచించే అవసరంలేదు. అది మతాతీతంగాని, ఆధ్యాత్మికంకాని ఏదైనా కాని. అప్పుడు వేదాంతి ఒక వైష్ణవుడు మతావలంబకుడు కానవసరంలేదు. వాసనలు, వృత్తులు, సంస్కారాలు మానవుడిని భౌతిక జగత్తుకు బందీ చేస్తున్నాయి. మంచి-చెడు, తప్పు-ఒప్పులు, భౌతికాలు-నైతికాలు. మోక్షం నైతిక గమ్యంకాదు. నైతికమే లక్ష్యం అయితే పొందింది పొందటం, తెలిసినదాన్ని తెలుసుకోవడం అవుతుంది. మోక్షాన్ని వ్యక్తం చేయడా నికి ఈ పదాలు చాలవు. భ్రాంతి, ఆచరణ, అతీతం - ఈ మూడింటి భేదం వివరించాడు. బ్రహ్మ ఒక్కడే. జీవులు పలువురు. బ్రహ్మ నామరూప రహితుడు. శరీరం నామరూప సహితం. జీవన్ముక్తుడు (Liberation-in-life) శరీరంతోనే వుంటాడు. విదేహముక్తి మరింత ఉన్నతమైంది. శరీరంతో పనిలేదు. శరీరం కర్మ చేయటానికి, కర్మఫలం అనుభవించడానికి కావాలి. శరీరం-మనస్సు, పదార్థం-మనస్సుల తాదాత్మ్య సిద్ధాంతంకాదు విముక్తి అంటే. భట్టాచార్య మాటల్లో objectless subject as freedom.

ఆధునిక తాత్వికుల్లో లేని సృజనాత్మక వ్యాఖ్యానపటిమ భట్టాచార్యలో బలీయంగా వుంది. ప్రాచీన భారతీయ తత్వశాస్త్ర ధోరణులను ఆధునిక భాషలో విమర్శనాత్మక విశ్లేషణచేసిన ఘనుడు.

1988లో కాళిదాస భట్టాచార్య పీఠికతో ఒకే పుస్తకంగా మోతీలాల్ బనార్సీదాస్ న్యూఢిల్లీ వారు ప్రచురించారు. ★

# God and Physics

"My new book also addresses, at least in passing, a controversy stirred by a ***A Brief History*** of Time. Many readers interpreted portions of my book as an attempt to disprove the existence of God. Not so, "You don't need to appeal to God to set the initial conditions for the universe, but that doesn't prove there is no God - he only acts through the laws of physics."

**- Stephen Hawking**

# ధోరణి–VIII

– డా॥ సంజీవదేవ్

''ధీర సమీరే యమునా తీరే వసతి వనే వనమాలీ''

ఏమిటి జయదేవుని అష్టపదులు పాడుతూ వస్తున్నారు?

వాటిని పాడటంలో నాకు ఆనందం, వినటంలో మీకు ఆనందం. అందుకే పాడుతూ వస్తున్నాను, మీరు వింటూ కూచోండి.

వాటిని పాడటంలో మీకు ఎక్కువ ఆనందమా, వినటంలో నాకు ఎక్కువ ఆనందమంటారా?

అదేమిటి ఇందులో ఎక్కువ తక్కువల తులనాత్మకత ఎందుకు? నాపాడటంలోనూ మీ వినటంలోనూ సమాన సంతోషం ఉంటుందని ఎందుకు అనుకోకూడదు?

అసలు మరో విషయం తేలాలి. మీరు నాకోసమై పాడలేరు. మీ కోసమైయ్యే పాడుకొంటారు. పాడుకొంటుంటే మీకు ఆనందం కలుగుతుంది కనుక పాడుకొంటారు. దాన్ని నేను వినటం జరుగుతుంది. కనుక దాన్ని వింటూ నేనూ ఆనందించాను.

కనుక గాయకుడిదే ప్రాధాన్యం అనటంలో సందేహం అవసరం లేదు. మేఘాలమీద ఇంద్రధనుస్సు ప్రత్యక్షమవుతుంది దాన్ని చూచి భూమిమీద ప్రజలు ఆనందిస్తారు. దీని అర్థం, భూమిమీది ప్రజల నిమిత్తం మేఘాలమీద ఇంద్రధనుస్సు వేస్తుందా? లేదు. ఇంద్రధనుస్సు వేయటం దానికి సహజం కనుక అది ఇంద్రధనుస్సు వేస్తుంది. దాన్ని చూడటంలో భూగోళవాసులు ఆనందం చెందుతారు. మీ నిమిత్తం పాడవచ్చు, పాడకపోవచ్చు. నేనెందుకు పాడినా, పాడిన నాకూ సంతోషం, వినే మీకూ సంతోషం.

మీ వాదనతో ఏకీభవిస్తూనే మీకో గొప్పతనాన్ని అంటగట్టాలి. గాయకుడు లేంది శ్రోత లేడు కాని శ్రోత లేకపోయినా గాయకుడుంటాడు. వినటం జరగకపోయినా పాడటం జరుగుతుంది. కాని పాడటం జరగంది వినటం జరగదు.

భలే సత్యం చెప్పేరండీ. గాయకుడిని అయి ఉండికూడా నాకు తెలియని విషయాన్ని మీరు సుందరంగా అభివ్యక్తపరచారు ఈ రెండు వాక్యాల్లో ''గాయకుడు లేంది శ్రోతలేడు; శ్రోత లేకపోయినా గాయకుడుంటాడు.'' మరి ఈ ఇద్దరూ లేకపోతేనో?

ఆ ఇద్దరూ లేకపోయినా పరవాలేదు. అపుడు గాయకులుకాని మనుషులు, శ్రోతలుకాని మనుషులు ఉంటారు; ఈ విశాల విశ్వం ఉంటుంది, సూర్యుడుంటాడు, చంద్రుడుంటాడు, తారలుంటాయి, దూరాలుంటాయి, దగ్గరలుంటాయి, కొండలుంటాయి, లోయలుంటాయి, భూచరాలుంటాయి, నభచరాలుంటాయి, జలచరాలుంటాయి, ఉభయచరాలుంటాయి, జననం ఉంటుంది, జీవితం ఉంటుంది, మరణం ఉంటుంది.

మంచి మిట్టమధ్యాహ్నంటపుడు కాలే ఎండలో మాడే నేలమీద నడుస్తూ ''ధీర సమీరే'' వంటి ఆనంద ప్రకృతిని చూపే అష్టపదిని పాడుతూ వస్తున్నారు. పాటలోని అందం ప్రకృతిని మార్చాలనా లేక ప్రకృతిలోని కాఠిన్యం పాటను మార్చాలనా? లేక ఏదీ దేన్నీ మార్చాలసిన పనిలేదనా?

మంచిమాట అడిగారు. పాటను ప్రకృతి మార్చటంవల్ల బాధ ఉంటుంది. కనుక పాటయే ప్రకృతిని మార్చాలి. ప్రకృతి అనేది మన ఇష్టాన్ని అనుసరించి ఉండదు. కనుక మన పాటలో ప్రకృతిని మన ఇష్టం వచ్చినట్లు మార్చుకోవాలి. అందుకని ఇటువంటి మండే మిట్టమధ్యాహ్న సమయంలో ఇందుకు విరుద్ధమైన వాతావరణను చూపే ''ధీర సమీరే'' అష్టపదిని పాడుతూ వచ్చాను. అదీ విషయం.

మంచిది. నాకో సందేహం. నిజానికి శబ్దం పుట్టింది అర్థాన్నివ్వటానికి, అర్థంద్వారా రసాన్నివ్వటానికి. కాని కొన్ని శబ్దాలు అర్థంతో సంబంధం లేకుండానే సూటిగా రసాన్ని ప్రసాదిస్తాయి. జయదేవుని అష్టపదుల్లోని పదాలన్నీ సుకుమారమైనవి, శ్రావ్యమైనవి. వాటిలో శ్రవ్యానందం ప్రధానమైనప్పటికీ దృశ్యానందం కూడా మిళితమై ఉంటుంది. పదం నిమిత్తమే పదం అన్నట్లు ప్రతి పదమూ ఒక రసఖండికగా వినిపిస్తుంది. ''లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే'' ఇవన్నీ ఒకోపదం ఒకో పారిజాతం. అన్నీ పదపారిజాతాలు. ఇటువంటి పదాలకు అర్థం లేకుండా, సంగీతం లేకుండా వాటికవే శ్రవ్యఖండాలుగా శ్రావ్యంగా వినిపిస్తాయి. శబ్దాన్ని మూడు విధాలుగా వర్గీకరించవచ్చు - అర్థాన్ని మాత్రమే ఇచ్చే శబ్దాలు, శ్రావ్యంగా మాత్రమే వినిపించే శబ్దాలు, అర్థాన్నిస్తూ శ్రావ్యంగా వినిపించే శబ్దాలు. మీ సందేహం తీరింది అనుకుంటాను.

ఈమధ్య మీరెక్కడైనా కచేరీలు చేస్తున్నారా? మీరు జంత్ర గాత్ర సంగీతాలు రెంటిలో కూడ కచేరీలు చేస్తారుకదా, ఆరెంటికీ హాజరయే శ్రోతల స్పందనలను గురించి మీ అభిప్రాయం ఏమిటి?

చెపుతా వినండి. అసలు సంగీతం అనేది విషయప్రధానం కాదు, శ్రవ్యప్రధానం. ఆపని మనిషిలోని గాత్రం ద్వారా, మనిషికి బయటి జంత్రంద్వారా కూడా జరుగుతుంది. మొదటి దాన్ని గాత్రసంగీతమనీ, రెండవదాన్ని జంత్ర సంగీతమనీ అంటారు. ఎక్కువమంది శ్రోతలు జంత్ర సంగీతాన్ని కాక గాత్ర సంగీతాన్నే ఆనందిస్తారు. కొద్దిమంది రసజ్ఞులు జంత్ర సంగీతాన్ని ఆనందిస్తారు. తెలిసిన వాళ్ళకు జంత్ర సంగీతమే ఎక్కువ రసానందాన్ని కలిగిస్తుంది. అయినా అదంతా వ్యక్తుల అభిరుచులమీద ఆధారపడి ఉంటుంది. కొందరు జంత్రగాత్రాల రెంటిలో ప్రవీణులై ఉంటే మరికొందరు ఏ ఒక్కదానిలో మాత్రమే ప్రవీణులై ఉంటారు. మను చరిత్రలోని వరూధిని అంటుంది ''జంత్రగాత్రముల రాల్గరగించు విమల గాంధర్వంబు విద్యమాకు'' అని.

సంగీతాన్ని గురించి చాలా కబుర్లు చెప్పేరు. జంత్రాలను గురించి వివరంగా వినాలని ఉన్నది. నామటుకు నాకు జంత్ర సంగీతమంటేనే ఎక్కువ ఇష్టం.

అయితే చెపుతా వినండి. వాద్యాలను రాగవాద్యాలనీ తాలవాద్యాలనీ రెండుగా విభజించ వచ్చు. వీణ, సితార, వేణు, సన్నాయి, క్లేర్‌నట్, వైలిన్, వయోలా మొదలైన వన్నీ

రాగవాద్యాలు. మృదంగం డోలు, డోలక్, తప్పెట, తబలా, ఖంజరీ, పఖ్‌వాజ్ మొదలైనవి తాళవాద్యాలు. తిరిగి రాగవాద్యాలు రెండు విధాలు. తంత్రీ వాద్యాలు, వాయు వాద్యాలు. వీణా, సితార్, వైలిన్ లాంటివన్నీ తంత్రీ వాద్యాలు. వేణు, సన్నాయి మొదలైనవన్నీ వాయు వాద్యాలు. తాళవాద్యాలు దాదాపు అన్నీ చర్మవాద్యాలే. జంత్ర సంగీతం, అందులోను ప్రత్యేకించి తాళవాద్యాలు సహకార వాద్యాలు (ప్రక్క వాద్యాలు)గా మాత్రమే వాడబడుతుంటాయి ఎక్కువగా. కాని ఇప్పుడు అవికూడ స్వతంత్ర వాద్యాలుగా వాడబడుతున్నాయి. రాగవాద్యాలకు స్వరం ప్రధానమైతే తాళవాద్యాలకు లయప్రధానం. నృత్య ప్రదర్శనకు రాగవాద్యాలకంటే తాళవాద్యాలు ప్రధానాలు.

చక్కని వివరణ ఇచ్చారు. ధన్య వాదాలు. కొందరు గాయకులు గానప్రదర్శనం మాత్రమే చేసి శ్రోతలను రంజింప చేస్తారు కాని వాటిని గురించిన విజ్ఞానాన్ని తెలపలేరు. అవిధంగా తెలిపేవారు కొందరు తెలుపుతారేకాని స్వయంగా గానం చేయలేరు. ఆవిధంగా కాక మీరు స్వయంగా శాస్త్రజ్ఞులూ కళాకారులు కూడా కావటం చాలా అరుదైన విషయం.

మీరు తెలిసినవారు కనుక నా శాస్త్రజ్ఞానాన్నీ, కళాకుశలతనూ ప్రశంసించారు. కొందరైతే ఆవిధంగా కాక ఆరెండూ ఒకే వ్యక్తిలో సమన్వయమై ఉన్నందుకు నిరసన తెలుపుతారు. వారంటారు, అయనకు పాడటమూ వచ్చు, పాటను గురించిన శాస్త్రజ్ఞానమూ ఉన్నది. అందువల్ల ఆరెంటిలో ఏ ఒక్కటిలోనూ ఆయనకు సమగ్రత లేదు. ఈవిధంగా విమర్శిస్తారు కొందరు. నిజమైన విమర్శకు ఎంత దక్షుడైనప్పటికీ తలవంచవలసిందే. కాని మిథ్యా విమర్శ ఎంత దక్షుడినుంచి వచ్చినా కూడ దానికి తలవంచరాదు. ఒకదాన్ని నిర్లక్ష్యం చేయటం తప్పు అయితే రెండవదాన్ని లక్ష్య పెట్టటం తప్పు.

అర్థం అయింది. వీటికి తోడు మీరు వాగ్గేయ కారులు కూడాను అనుకుంటా.

మీ ఊహ నిజమైందే. నేను వాగ్గేయకారుడిని కూడా కనుకనే పాటలను వ్రాస్తానుకూడ.

అడుగో మన కవిగారు వస్తున్నాడు ఆకాశంవైపు చూస్తూ, ఈ భూమి సంగతి తనకు పట్టనట్లు. ఎరుగుదురా గాయక మహాశయ ఆయన్ను. ఎరిగే ఉంటారు. మిమ్ము ఎరగని వారెవరైనా ఉంటారేమో కాని ఆయన్ను ఎరగని వారెవరుంటారు. మీ కళ కేవలం నాదానికి మాత్రమే సంబంధించి ఉంటుంది. ఆయనది మాటలకు సంబంధించి ఉంటుంది. మాటలన్నీ మనుషులకు చెందినవే కనుక, ఆయన కవితా కళకు మాధ్యమం మాటలే కనుక మనుషులు అయిన వాళ్లంతా ఆయనకు పరిచితులే. పరిచితులంతా స్నేహితులు కాకపోవచ్చు కాని ఆయన విషయంలో మాత్రం అది వేరు. మిత్రులంతా ఆయనకు పరిచితులైనట్లే పరిచితులంతాకూడ ఆయనకు మిత్రులే.

రండి రండి కవిగారు. కవిగారిని కళ్లతోచూచి వారి కవితలను చెవులతో విని చాలాకాలమైంది. కవిగారి కవితలకంటే వారి మాటలు ఎక్కువ ఇంపుగా ఉంటాయి.

ఏమిటండోయి అననట్లే కనబడుతూ అనేస్తున్నారు సూటిగా కాకపోయినాకూడ.

లేదండీ మీవి ఏవీ బాగుండలేదని నేననలేదు. మీ మాటలు బాగుంటాయనే అన్నాను; మీ కవితలు బాగుండవని అనలేదు; మీరు బాగుండరని అనలేదు; మీ ఊరు బాగుండదని

అనలేదు. ఏదీ బాగుండదని అననప్పుడు నామీద మీకు కోపమెందుకు? దీన్నిబట్టి ఏమనుకో వలసి వస్తుందంటే మీకు సంబంధించిన అన్నిటినీ బాగున్నవనటం మీకు నచ్చదని తెలుస్తుంది. అదే నిజమైతే ఇంతవరకు అది బాగున్నది, ఇది బాగున్నది అన్న లిస్టునంతా చెరిపివేసి అది బాగాలేదు, ఇది బాగాలేదు, ఏదీ బాగాలేదు అనే కొత్త లిస్టును తయారుచేసి మీకివ్వమంటారో తెలపండి. అవిధంగా మీకు సంతోషం ఏర్పడుతుందంటే అంతే చేస్తాను.

ఏమండోయి, మాటల టెక్నిక్‌లో కవుల్నికూడా మించిపోయి మంచి ధోరణిని అలవరచు కున్నారు.

లేదండీ, మీది మాటల కళ కనుక అది కవిత. నాది కళలేని మాటలు మాత్రమే. అందుకని నాది అకవిత. మీరు కవి, నేను అకవిని. మీ మాటలు సాహితీజ్ఞానం ఉన్నవాళ్లకు మాత్రమే తెలుస్తాయి. మరి నావో సాహిత్యజ్ఞానం లేనివాళ్లకు మాత్రమే తెలుస్తాయి. ఉభయ వర్గాలకూ తెలియాలంటే మీ మాటల్నీ నామాటల్నీ కలిపి మరెవరైనా మాట్లాడితే తెలుస్తుంది వాళ్లకు. అదీ సంగతి.

అట్లాగే, అసలు తెలియటం అంటే తెలియక పోవటం అంటే ఏమిటి? తెలిసినందున ప్రయోజనం ఏమిటి? తెలియనందున అప్రయోజనం ఏమిటి? వీటికి కలిపి ఒకే అర్థం ఏమైనా ఉన్నదా? భిన్న భిన్న అర్థాలేమైనా ఉన్నాయా? అసలు అర్థమనేదే లేదా? అర్థమనేదే లేదంటే చిక్కే లేదు. ఒకే అర్థం ఉంటే కొంత చిక్కుటుంది; ఒకటికంటే మించి అర్థాలున్నాయంటే ఎంతో అనర్థకమవుతుంది.

తెలియటం అంటే తెలియటానికి ముందున్న విషయంతో పరిచయం ఏర్పడటం, దాని స్వరూప స్వభావాలతో ఎరుక ఏర్పడటం. తెలియటం ప్రధానంగా రెండు తీరులలో ఉంటుంది. ఒకరిని తెలియటం, ఒకరిని గురించి తెలియటం. వివేకానందను తెలియటం అంటే ఆయనతో ప్రత్యక్ష సంబంధం ఉండటం, ఆయన్ను చూచి ఉండటం, ఆయన చెప్పేది విని ఉండటం మొదలైనవి. వివేకానందను గురించి తెలిసుండటం అంటే ఆయన మాటలను వినకపోవచ్చు కాని ఆయన్ను గురించిన వివరాలు తెలిసి ఉండటం. ఒకే వ్యక్తిని తెలియకపోవటం, తెలియటం కూడా ఉంటుంది. ఈ చర్య కాలంపై ఆధారపడి ఉంటుంది.

అది కాలంమీద ఆధారపడి ఉంటుందన్నారు. అందుకొక ఉదాహరణ ఏమైనా ఇవ్వగలరా? తెలియటం, తెలియకపోవటం అనే వాటికీ కాలానికీ సంబంధం ఏమిటో నాకు బోధపడకుండా ఉన్నది.

ఈ విషయంలో మీరు ఖంగారు పడాలసినంత ఖంగారు ఏమీ లేదు. ఇది చాలా తేలికైన విషయం. సామాన్యమైన విషయం.

ఒక వస్తువును కాని, వ్యక్తినికాని, ప్రదేశాన్నికాని తెలుసుండటం, తెలియకుండా ఉండటం అనేది కాలంమీద ఎట్లా ఆధారపడి ఉంటుందంటే వాటికి కాలం అనేది అంటుకొని ఉంటుంది. ఒకే వ్యక్తి భూతకాలంలో ఉండి ఉంటాడు, వర్తమానంలో కూడా వుండి వుంటాడు. భూతకాలంలోని వ్యక్తిని మనం ఎరిగుండకపోవచ్చు. ఆ వ్యక్తియే వర్తమానంలోకొచ్చిన తరువాత మనం ఎరిగి ఉండవచ్చు. అంటే ఒకే వస్తువును కాని వ్యక్తిని కాని అప్పుడెరుగం, ఇప్పుడెరుగుదుము. కాని దీన్ని తిరగేసి చెపితే సత్యం మరుగు పడుతుంది.

అంటే ఒక వ్యక్తిని అప్పుడెరుగుదుము, ఇప్పుడెరగము అని చెపితే అది అసత్యమవుతుంది. అపుడెరుగము, ఇప్పుడెరుగుదుము అంటే సరిపోతుంది. కాని ఇటుదటు మారిస్తే సరిపోదు. తెలిసున్న మనిషి తెలియకుండా పోవటం ఎపుడో, ఎక్కడో తప్ప సంభవంకాదు. తెలియంది తెలవటం సహజంకాని తెలిసింది తెలియకపోవటం సహజంకాదు.

దేన్ని కదిలించినా మేధావులు దాన్ని అనంతంగా మారుస్తారు, ఒకోసారి దాన్నంతా అయోమయంగా తయారుచేస్తారు. మేధావులు కాని వాళ్లకు అదంతా అగాధం అవుతుంది; తెలుసుకోవాలనే ప్రయత్నం పద్మవ్యూహంగా తయారవుతుంది. తెలిసినదంతా తెలియనట్లు తడుతుంది. తెలియనిదంతా తెలిసినట్లు. మేధావులు తెలిపేదేదో మేధావులకే తెలుస్తుంది కాని అమేధావులకే తెలియదు. మేధావి కావటం మాటలు కాదు. ఎంతో సాధనతోకాని మేధావి కాలేదు. ఒకసారి మేధావి అయినవాడు మరెంతో సాధన చేస్తేనే కాని మేధావి ముసుగును తొలిగించుకోలేడు అనిపిస్తుంది. మనుషులంతా మేధావులు కావటం అంటే భూలోకంలోని తెలివితక్కువంతా మాడిపోవడమే. తెలివితక్కువంతా మాడిపోతే తెలివంతా దీటీ అయి వెలుగుతుంది. ఆ దీటీ వెలుగులో కామన్‌సెన్సు చాలావరకు దహించుకుపోతుంది. కనుక అనిపిస్తుంది, మేధ పెరగాలి కాని మేధ లెవెల్‌కే పెరగాలి కానిఆ లెవల్‌కు మించి పెరిగితే మొత్తం మేధయే తరిగిపోతుంది. అటువంటి ఆపదనుంచి బయటపడాలంటే బయటబడే యత్నాలు అనేకం చేయాలి.

మమ్మ్మ మేధావులు మేధావులు అని ఎత్తి పొడుస్తూనే మీరు సూపర్ మేధావుల పాత్రను నిర్వహించారు. నేను ప్రధానంగా మేధావినికాదు, నేను ప్రధానంగా కవిని. కొందరు మేధావులు కవులుగా కూడ ఉన్నారు. అదేవిధంగా కొందరు కవులు మేధావులుగా కూడ ఉన్నారు. ఈ రెండవ వర్గానికి చెందుతాను నేను.

మీరు చేసిన ఈ వర్గీకరణలోని వివరణనాకు అవగతం కాలేదు. మేధావి అయిన కవికీ, కవి అయిన మేధావికీ మధ్య ఉన్న ప్రభేదం ఏమిటో?

నేను అనుకొంటూనే ఉన్నాను ఈ వర్గీకరణ విషయంలో మీరు కొంత గజిబిజి అవుతారని. అట్లాగే అయినారు కూడ. అయితే చెపుతా వినండి. మేధావి అయిన కవి అంటే ఆ వ్యక్తిలో కవిభాగం ఎక్కువ ఉంటుంది. మేధావి భావం తక్కువ ఉంటుంది. ఇటువంటివారు మేధావుల మహా సభల్లో పాల్గొనుటకు అనర్హులు; కవుల మహాసభల్లో మాత్రమే పాల్గొన అర్హులు. ఇక కవి అయిన మేధావి అంటే వారిలో మేధావిభాగం ఎక్కువ ఉంటుంది, కవిభాగం తక్కువ ఉంటుంది. ఇటువంటివారు కవుల మహాసభల్లో పాల్గొనటానికి అనర్హులు, మేధావుల మహాసభల్లో మాత్రమే పాల్గొన అర్హులు.

మీ విశదమైన విశ్లేషణ నాకు వివరంగా బోధపడింది. ఒకప్పుడు విశ్వ సాహిత్యంలో కవితారచనలు ఎక్కువ, కవితాచర్చలు తక్కువ ఉండేవి. తరువాత తరువాత రెండూ సమానంగా ఉంటుండేవి. నేడు కవితా రచనలు తక్కువ, కవితా చర్చలు ఎక్కువ అయినాయి. ఈ మూడిటిలో ఏది ఎక్కువ వాంఛనీయం అంటారు? మొదటిదా, రెండవదా, మూడవదా? మొదటిదానిలో సృజనశీలత ప్రధానం, రెండవదానిలో సృజనశీలతా, సమీక్షాత్మకతా సమానం, మూడవదానిలో సమీక్షాత్మకత ప్రధానం.

మీరు తెలియనట్లే నటిస్తూ ఎన్నో మీకు తెలిసిన విషయాలను, ఇతర్లకు తెలియని విషయాలను వింతగా వివరిస్తారు. ఏమైనా కవితారంగంలో కవితా రచనకే ప్రాధాన్యం ఉండాలి కాని, కవితా చర్చకు కాదు. రచనది మొదటిస్థానం, సమీక్షది రెండవ స్థానం. కవిత ఉండబట్టే కవితా సమీక్ష ఉంటుంది కాని కవితా సమీక్ష ఉండబట్టి కవిత ఉండదు. మనిషి విషయంలోను అంతే, మనిషికి జీవించటం ప్రధానంకాని ఆలోచించటం ప్రధానం కాదు. జీవించటం అనేది ఉంటేనే ఆలోచించటానికి వీలుంటుంది; అంతేకాని ఆలోచించటం ఉండబట్టి జీవించటం లేదు. అయితే పదిహేడో శతాబ్దపు దార్శనికుడైన డి కార్టే అన్నాడు "Cogito ergo sum" అని. అంటే నేను ఆలోచిస్తున్నాను కనుక నేను జీవిస్తున్నాను అని. మనిషిలోని ఆలోచనాశక్తికి ప్రాధాన్యం ఇవ్వటానికని అటువంటి అతిశయోక్తిని ఆయన కల్పించాడు. మనిషి అంటే ప్రధానంగా హేతువాదే కాని అస్తిత్వవాది (existentialist) కాదని ఆయనవాదం. కాని హేతువాదాన్ని సమర్థించే ఆయన వాక్యం హేతుసమ్మతంగా లేదు. అది సత్యదూరమై ఉన్నది. మానవుని కార్యకలాపాలన్నీ కూడ జీవితంనుంచే ప్రాదుర్భవిస్తాయి కాని జీవితం మిగతా కార్యకలాపాలనుండి ఉద్భవించదు.

నేను మేధావిని కాను కాని నా దృష్టిలో మీవాదన ఎంతో సహేతుకంగా ఉన్నది. వాస్తవానికి మానవుడు జీవిస్తాడు కనుక ఆలోచిస్తాడు అనే అస్తిత్వవాది అయిన జీన్ పాల్ సాత్ సిద్ధాంతం డి కార్టే వాదంకంటే ఎంతో సహేతుకమైంది. మీరు కవితలు రచిస్తే జీవించి ఉండబట్టే రచిస్తారు కాని జీవించంది రచించలేరు.

మనం ఈ నైరూప్య చర్చలో ఏమేమో సమంజసమైనవీ అసమంజసమైనవీ అనేకం చెప్పుకొంటూ మనం అనుకునేయి మాత్రమే నిజమని నమ్ముతూ ఆనందిస్తూ వచ్చాం. ఆ బాటలో ఇంతవరకు ఆగుదాం.

కవిగారూ నాకొక ఊరు ప్రయాణం ఉన్నది, నేను పోయి వస్తాను. నేను చీకటి పడకముందే తిరిగి వస్తాను. పగలల్లా ఎండకాసింది. దినాంతంలో పశ్చిమాకాశం నీలి మేఘాలతో నిండు తుంది. రాత్రికి వానజల్లులు రావచ్చు, రాకపోవచ్చు. జల్లులు వచ్చినా రాకున్నా నేనుమాత్రం రాకుండా ఉండను.

అట్లాగేనండి వెళ్లిరండి. అప్పటిదాకా నేనేదో విధంగా ప్రొద్దు పుచ్చుకుంటాను. నేను ప్రొద్దు పుచ్చకపోయినా ప్రొద్దు కుంకక మానదు; మనం రమ్మన్నా రావద్దన్నా వానజల్లులు రాకుండా ఆగవు. కొందరికి ఏకాంతంలో ఆనందం దొరికితే మరికొందరికి దొరుకుతుంది జనాంతంలో.

మీ సంభాషణతో నన్ను నిలిపివేశారు. అదుగో పడమటి ఆకాశంలో ఉరుములూ మెరుపులూ సాగినాయి. మనకు కొంతదూరంలో జల్లులుకూడ తుషార రూపంలో గోచరిస్తు న్నాయి. అయితే ఇక ఈ పూటకు నాప్రయాణం ఆపుకొంటాను.

వాతావరణం ఈరకంగా మారుతున్నప్పుడు ప్రయాణం మానుకోటమే తెలివైనపని. తొలకరివాన జల్లుల్లో తడవటంలో ఆనందం ఉంటుందికాని తడిసిన తరువాత అనుభవించే జలుబులో, ఒకోసారి జ్వరంలో బాధకూడ ఉంటుంది. అయితే నేను కవిని కనుక, వాన జల్లుల్లో తడిసిన తరువాత అనుభవించబోయే శరీర బాధకంటే వానజల్లుల్లో, ఉరుముల్లో మెరుపుల్లో తడుస్తూ, దడుస్తూ అనుభవించే ఆనందమే ఎక్కువ సుఖంగా తడుతుంది. ●

# Mind-Body Revolution

*Evidence that the mind and body influence each other abounds. And suggests something much stranger: That awareness isn't confined to the brain; it operates 'nonlocally,' beyond the biochemical links between brain and, say, the immune system. This consciousness revolution is rattling the very foundations of Western medicine.*

*Rene Descartes, the 17th-century mathematician who shaped the world as we know it, has been officially pronounced dead.*

*Immortalized in Bartlett's for his inscrutable, Popeye-like declamation, "I think therefore I am," Descartes was history's most persuasive partisan of the mind-body split, a bedrock notion of modern science. Mental events, the savant declared, occur in a separate domain from those of the flesh. Consciousness has no business in the mean streets of matter. As a result, medical science came to be dominated by a materialism.*

*– Marc Barasch*

# ఆంగ్ల పత్రికా ప్రపంచంలో పేరుపొందిన ఆంధ్రులు

– డా॥ డి. ఆంజనేయులు

ఆంధ్రుల్లో ఆంగ్ల విద్యాధికులైన విబుధులు, విజ్ఞానవేత్తలు - కొందరు దేశంపై వలసాధిపత్యం కొనసాగిన రోజుల్లో దూరంగా ఇతర ప్రదేశాలకు వెళ్ళి తమ ప్రాంతంలో ఉన్నట్టుగానే పత్రికా రంగంలోనూ, ప్రజాహిత జీవనంలోనూ విశిష్ట పాత్రను నిర్వహించారు. వ్యక్తి ఆరాధన అవగింజంతైనా గిట్టని ఆంధ్రప్రవృత్తికి పత్రికారచన సంపాదకత్వం ఉచిత వృత్తిగా సమకూరింది.

## అధికార ధిక్కారం:

తొలితరం పత్రికా రచయిత అధికారానికి తల ఒగ్గలేదు. అతని గొంతు ప్రతిపక్ష అనధికార నాయకుని గొంతు. చెప్పాలంటే ఆవాణి ప్రజావాణి. ఈ రచయితల్లో కొందరు ప్రతిభావంతులు వేసిన కాలిబాటలు కోటానుకోట్ల ప్రజలకు రహదారులవుతుండేవి. పరాయి దుష్టపాలన నుంచి విముక్తికోసం వారు ప్రభుత్వంమాట ఏదైనా సరే ముందు విమర్శించడం పనిగా పెట్టుకునేవారు. దూషణ, రంధ్రాన్వేషణ వారి ఆయుధాగారంలోని తూటాలు, తుపాకులు. ప్రతి తలుపు చాటునా ఎల్లవేళలా శత్రువు పొంచుంటాడని, వానిని చీల్చి చెండాడమే తమ కర్తవ్యమనీ భావించారు. వారి సంపాదకీయాలు, లఘు వ్యాసాలూ పాఠకులను తరచు ప్రభావితం చేస్తుండేవి.

ఇంగ్లీషు పత్రికా రచనారంగంలో అడుగు మోపిన తొలి ఆంధ్రుడు కీ.శే. సి.వై. చింతామణి (1880-1941) ముప్ఫై సంవత్సరాలకు పైగా ఆయన అలహాబాదులో 'లీడర్' పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఉత్తర ప్రదేశ్‌లో వివేకవంతమైన ప్రజాభిప్రాయం పరిణతి చెందడంమీద, భారత రాజకీయాల్లో ఒక ఉదారవాద దృక్పథం రూపు దిద్దుకొనడం మీద ఆయన సుస్పష్టముద్ర కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. బ్రిటిష్ పార్లమెంటరీ ప్రజస్వామ్యాన్ని ఎంతగానో ఆదరించిన చింతామణి మాంటే ఫర్డు ప్రణాళిక ననుసరించి ఆ రాష్ట్రంలో కొంతకాలం మంత్రిగా కూడా ఉన్నారు. స్వాభిమాని చింతామణి జాతీయ దురహంకార బ్రిటిష్ ఉన్నతాధికారులకు దూరంగా ఉండేవాడు. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యమంటే ఆయనకు ప్రాణం.

ఒకసారి లీడర్ పత్రిక సంపాదక వర్గాధ్యక్షుడు పండిత మదనమోహన్ మాలవ్యాకూ, చింతామణికీ కొన్ని విధానాలూ, అంశాలపట్ల అభిప్రాయభేదాలురాగా మాలవ్యా అపదవినుంచి తప్పుకోవడం జరిగిందంటే ఆనాడు సంపాదకుని మాటకూ నిజాయితీకి ఎంత విలువ ఉండేదో తెలుస్తుంది. అసలు ఉత్తరాదికి పోవడానికి ముందే విజయనగరంలో చింతామణి

తన సొంత పత్రిక ఇండియన్ హెరాల్డ్‌ను నడుపుతూ పలువురి దృష్టిని ఆకర్షించాడు. 'హిందూ' సంపాదకుడు జి. సుబ్రహ్మణ్య అయ్యర్ వద్ద పత్రికారచనలో శిక్షణ పొంది మెరుగులు దిద్దుకొన్నాడు. రాజకీయ సమస్యలను లోతుగా అవగాహన చేసుకొని వాస్తవిక హేతుబద్ధ బలంతో కుర్చీ వేదాంతులు పర్యాలోకన చెయ్యక తప్పనంత రూఢిగా చెప్పడంలో అందెవేసిన చెయ్యి. విషయం మీద పట్టు, దానికి తోడు అపురూపమైన జ్ఞాపకశక్తి ఆయనది. కాంగ్రెసు మహాసభ ఏ సంవత్సరం ఎక్కడ జరిగిందో దానికి ఎవరు అధ్యక్షత వహించారో ఆయన అలవోకగా చెప్తుంటే శ్రోతలు బొమ్మలై చెవులప్పగించి వినేవారు. రాజకీయ విశ్లేషణలోని నైశిత్యంతోపాటు ఆయన వచన శైలిలో నైతిక విలువలు ఎడ్విన్ శామ్యూల్ మాంటేగ్, రైట్ హానరబుల్ శ్రీనివాసశాస్త్రి వంటి అభిమానులను ఆకట్టుకొంది.

ఈ క్రమాన లెక్కించదగ్గ రెండవవాడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం (1873-1955). బారిస్టరు పట్టంతో ఇంగ్లాండునుంచి తిరిగొచ్చి స్వాతంత్ర్య సమరాంగ ణంలో ఉరికి, జాతీయ భావప్రచారానికి ఆంగ్ల దినపత్రిక 'స్వరాజ్య'ను 1921లో పాంచజ న్యంలా పూరించాడు. ఆయనే ఆ పత్రికకు ముఖ్య సంపాదకుడు. స్వార్థం, సంకుచితత్వం ఎరగని ఆయన జీవితంలాగే ఆ పత్రికా తెగువకు మారుపేరుగా సాహసయాత్ర సాగించింది. ఈ దినపత్రికకు సహాయ సంపాదకులుగా పనిచేసిన యువకులు జి.వి. కృపానిధి, ఖాసా సుబ్బారావు, కోలవెన్ను రామకోటేశ్వర రావు, కుందూరి ఈశ్వరదత్తు వంటివారు రాటుదేలి ఆంగ్ల పత్రికా ప్రపంచంలో ప్రసిద్ధి పొందారు.

ఈ కోవలో ప్రకాశం తర్వాత ప్రజ్ఞా పాటవాలలో, ప్రకృతిలో ఆయనకు పూర్తిగా భిన్నమైనవాడు - కాంగ్రెసు చరిత్రకారుడుగా గణుతికెక్కి కాంగ్రెసు అధ్యక్ష స్థానాన్ని సైతం అలంకరించిన డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య (1880-1959). వైద్య శాస్త్రంలో మేటి అనిపించుకొని పత్రికారంగంలో కాలుమోపి బందరునుంచి 'జన్మభూమి' అనే ఆంగ్ల వారపత్రికను కొంతకాలం నడిపాడు. మౌలానా మహమ్మద్ అలీ వెలువరిస్తూ వచ్చిన 'కామ్రేడ్ ' పత్రికతో పోల్చదగినదిగా ఉండేదని చెప్పొచ్చు. ఒక్క చేతిమీదుగా నడచిన ఆ పత్రిక వ్యాసాల్లోని చెణుకులు, స్వారస్యం, రాజకీయ పరిజ్ఞానం ఉద్వేగంతో కూడుకొని ఉండేవి. అందుకే ఆయన్ను 'బాంబే క్రానికల్' పత్రికకు బి.జి. హార్నిమన్ తర్వాత ప్రధాన సంపాదకునిగా ఆహ్వానించారు. ఆ పదవిని అప్పట్లో ఆయన స్వీకరించలేదు. మరికొన్నేళ్ళ తర్వాత ప్రచురితమైన ఇంగ్లీషు దినపత్రిక 'ఇండియన్ రిపబ్లిక్' డైరెక్టర్ల సంఘానికి అధ్యక్షుడ య్యాడు.

ఆర్థిక శాస్త్రంలో లండన్ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టం పుచ్చుకొన్న డా॥ లంకా సుందరం ఢిల్లీనుంచి కొన్నేళ్ళపాటు ప్రచురించిన 'కామర్స్ అండ్ ఇండస్ట్రీ' అనే వారపత్రిక ఆయనకు మంచిపేరు తెచ్చి పెట్టింది.

## కోటంరాజు సోదరులు :

కోటంరాజు పున్నయ్య, ఆయన తమ్ముడు రామారావు తలపుకు రాగానే భారతీయ పత్రికా రంగానికి 'అక్షయుగళం - లాంటి ఘోష్ సోదరులు శిశిర్‌కుమార్, మోతీలాల్ గుర్తుకు వస్తారు.

పున్నయ్య (1884-1950) నెమ్మదస్తుడే కాక నిలకడ గలవాడు; సాధు స్వభావి. మంచితనం, మార్దవం ఆయనలో కుడి ఎడమలుగా ఉండేవి. ఆయన బ్రహ్మ సమాజవాది కందుకూరి ప్రబోధనలచే ప్రభావితుడు. సంస్కరణాభిలాషి. బొంబాయి, మదరాసు నగరాల్లో ఆంధ్రపత్రికకు చేదోడుగా ఉంటూవచ్చి కరాచీలో 'సింధ్ అబ్జర్వర్' పత్రికలో సంపాదకుడుగా మంచిపేరు గడించాడు. పౌర సమస్యలపై 'షాట్ అండ్ షెల్' అనే శీర్షికన ఆ పత్రికలో నిర్వహిస్తూ వచ్చిన కాలం ప్రజాభిమానం పొందింది. పున్నయ్య ఉదార జాతీయవాది. హిందూ ముస్లిం సమైక్యతకు మణిపూసగా ప్రసిద్ధి పొందాడు. భారత పాకిస్తాన్ విభజనవల్ల కలిగిన హింసాకాండ ఆయనకు దుర్భరమయింది. గాయపడ్డ మనస్సుతో బొంబాయికి ప్రాణాలతో తిరిగొచ్చాడు గాని, పాటవం సన్నగిల్లి నైరాశ్యం అలముకొని కన్ను మూశాడు.

అన్నదమ్ముల్లో ఒకరొకరికి ఎందునా పోలికలేదు. సోదరుడు రామారావు (1896-1961) ఏ ఒక్క వార్తా పత్రికలోనూ స్థిరంగా ఉండలేకపోయాడు. ఆయనొక ముక్కోపి. ఆయన సమకాలీనుల్లో పోతన్ జోసఫ్ ఎన్ని ఉద్యోగాలు మార్చారో ఈయన కూడా చొక్కాలు మార్చినట్లు అన్ని ఉద్యోగాలు మార్చారని అంటారు. ఉద్రేకంలో ఎప్పుడేం చేస్తాడో ఊహకందేది కాదు. 'ద టైమ్స్ ఆఫ్ ఇండియా', 'ద హిందుస్తాన్ టైమ్స్', 'పయోనీర్', 'సర్చ్‌లైట్' మున్నగు పత్రికల్లో పనిచేసిన అనుభవజ్ఞుడు కావడంతో లక్నోలో నెహ్రూగారి 'నేషనల్ హెరాల్డ్' పత్రికకు తొలి సంపాదకుడుగా ఎంపికై ఒక గుర్తింపు పొందాడు.

1945లో ఆయన ఒక సంపాదకీయంలో అభినందించిన యు.పి. గవర్నర్ సర్ మారిస్ హాలెట్ హయాంలో జరిగిన బాల్లియా హత్యాకాండ వార్తలను పతాక శీర్షికలో ప్రచురించాడు. బాల్లియా ఆజమ్‌గడ్ లో సాగిన అకృత్యాలు, దోపిళ్ళు, దహనాలు, హననకాండను ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆకతాయి చర్యగా అభివర్ణించాడు. ఈయన అక్షర శరాలను సంధించినందుకు ప్రభుత్వం ఈయనపై కసితో పెద్దమొత్తం ధరావత్తుగా చెల్లించాలని ఆదేశం జారీ చేసింది. అందుకు స్పందించిన ప్రజలు భూరి విరాళాలు సేకరించి అంతకన్నా పెద్ద మొత్తమే చెల్లించారు. అసంఖ్యాక బలహీన ప్రజల గొంతుకలన్నీ ఏకమై హోరెత్తే తుఫాను ఘోషగా నినదించిన ఆ ఉగ్ర నరసింహ గర్జన శత్రువుకు తలవొంపును తెచ్చింది. అర్ధరాత్రి ప్రయాణిస్తున్న రైలునుంచి అకస్మాత్తుగా కిందపడి తుదిశ్వాస వదలిన ఆ పాత్రికేయుని కథ ఒక ప్రభంజనంలా వీచి వెలిసింది. భారతీయ పత్రికా రచనపై ఈయన వేసిన ముద్ర చెక్కుచెదరనిది.

''స్వరాజ్య'' గూటిలో ప్రకాశం రెక్కల నీడలో ఎదిగిన యువ జర్నలిస్టులలో జి.వి. కృపానిధి, ఖాసా సుబ్బారావు సుప్రసిద్ధులు. న్యాయశాస్త్ర నిష్ణాతులు కావలసిన ఆ ఇద్దరు తమ గురువుగారి ఉరకలు వేసే ఉత్సాహం నుంచి దేశభక్తి ప్రపూరితమైన నడవడి నుంచి స్ఫూర్తిని పొందారు. కాని, మనస్తత్వంలోనూ, జీవితంపట్ల అవగాహనలోనూ ఈ ఇద్దరిమధ్య ఉన్నంతటి వైవిధ్యం ఇంతా అంతాకాదు.

కృపానిధి నెమ్మదస్తుడు; ఏది చేసినా ఆలోచించి చేస్తాడు. పని కావడం మీద ఎప్పుడూ ఒక కన్ను వేసి ఉంచుతాడు. అసలు ఈయన ప్రకాశం పరిధిలోకి ఎలా వచ్చాడన్నదే ఆశ్చర్యం. అనుకోకుండా జరిగే వింత సంఘటనలలో బహుశా ఇదొకటై ఉంటుంది. ఆర్థిక పరిస్థితి

బాగా వున్న రోజులలోనే కృపానిధి "స్వరాజ్య"లో పనిచేశాడని అప్పటివాళ్ళు అంటారు. చాలా తెలివైన కుర్రాడని, రాయాలనే ఉత్సాహం బాగా ఉండేదనికూడా చెప్తారు. కఠినంగా ఏదైనా చెప్పవలసి వచ్చినా, తెగడవలసి వచ్చినా సుతిమెత్తని భాషలోనే చెప్పేవాడట. ఎవరితో ఎలా స్నేహం చేయాలో, ఎవరితో ఎలా మాట్లాడాలో కూడా బాగా తెలుసు. 'హిందుస్తాన్ టైమ్స్'లో ఒకమంచి అవకాశం చూసుకొని అతను త్వరలోనే ఢిల్లీకి మకాం మార్చాడు. కొద్దికాలం 'ఇండియన్ న్యూస్ క్రానికల్'లో కూడా పని చేశాడు. తర్వాత మద్రాసులోని 'సదరన్ లాంగ్వేజస్ బుక్ ట్రస్ట్'కు అధ్యక్షుడయ్యాడు. ఆఖరుకి బెంగుళూరు వెళ్ళి 'డెక్కన్ హెరాల్డు' పత్రికకు పోతన్ జోసెఫ్ స్థానే ఎడిటరైనాడు. జాగ్రత్త కలిగినవాడు కనుక ఎటు ఉంటే లాభమో బాగా తెలుసు.

ఖాసాకు జాగ్రత్తే తెలీదు. అలాగని జీవితం అంటే ఏమిటో తెలియనివాడు అనికూడా అనలేము. కాస బియాంకా లాంటివాడు. ఏమి చెబితే అది మొదటగా చేసేవాడు. కనుకనే 'స్వరాజ్య' దెబ్బ తింటున్నా కదలక అక్కడే ఉండిపోయాడు. దినపత్రిక 'స్వరాజ్య' మూత పడిపోయిన చాలాకాలం తరువాత అతనే 'స్వరాజ్య' 'స్వతంత్ర' పత్రికలను స్థాపించి నడపడం ఒక విశేషం. మధ్యలో కొన్నాళ్ళు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లోనూ, 'ఫ్రీ ప్రెస్'లోనూ, 'ఫ్రీ ప్రెస్ జర్నల్' (బొంబాయి)లోనూ కలకత్తానుంచి వచ్చే 'ఇండియన్ ఫైనాన్స్'లోనూ కూడా పనిచేశాడు. ఎక్కడ పనిచేసినా సాటి ఉద్యోగులను, స్నేహితులను మాత్రం మరచి పోయేవాడుకాదు.

వ్యక్తిగత నిజాయితీ, అభిప్రాయ వ్యక్తీకరణ, స్వేచ్ఛ అనే ఆదర్శాలను ఎంతమాత్రం జారవిడవకుండా వాస్తవిక పరిస్థితులతో సిగపట్లు పట్టగల సామర్థ్యం 'ఖాసా'కు ఉండేది. రాజకీయాలలోనూ, ఆనాటి వివాదాలలోనూ ఎంతగా తలమునకలవుతున్నప్పటికీ మేధస్సుతో ముడిపడి ఉన్న ఉన్నత విలువలను ఆయన తన రెండు వారపత్రికలలోనూ నిర్లక్ష్యం చేసేవాడు కాదు.

అనుబంధాలను అంతలోనే మార్చేసుకుంటాడని, ఒక విధానానికి కట్టుబడి ఉండడని ఆయనమీద తరచూ విమర్శలు వస్తూండేవి. అయితే జాగ్రత్తగా పరిశీలించే వారికి ఆదర్శబద్ధమైన ఒక ప్రయోజనం ఆయన వ్యవహార శైలిలో కనిపించేది. పోరాడి సాధించడం, పరిణతి గలిగిన పనితనం ఆయన విశిష్ట లక్షణాలు. త్వరగా ఉద్వేగానికి లోనయ్యే తత్వం అయినప్పటికీ ఎవరెటువంటివారో అంచనా వేయడంలోనూ ఏది ఏమిటో అర్థం చేసుకోవడంలోనూ గట్టివాడు. ఆయన ముందువెనుకలు చూడడనడం నిజంకాదు.

కోలవెన్ను రామకోటేశ్వరరావు (1894-1970) స్థాపిం[illegible] 'త్రివేణి' త్రై మాసపత్రిక కళ, సాహిత్యం, చరిత్ర వాహినుల సంగమం. రామకోటేశ్వరరా[illegible] కూడా 'స్వరాజ్య' మనిషే, న్యాయవాద వృత్తి చేసి స్వాతంత్ర్య సమరయోధుడై జర్నలిస్టు అయినా[illegible] ఆయన మృదు స్వభావుడు. ఆయనది కళాకరుడి మనస్తత్వం. ఒత్తిడులు, హడావిడులతో కూడిన దినపత్రిక వ్యాసంగాన్ని వదిలేసి ఆయన అంతకంటే కాస్త ప్రశాంతమైన త్రై మాసపత్రికా వ్యాసంగాన్ని చేపట్టారు. అయితే అందులోనూ ఆయనకు కష్టాలూ, కన్నీళ్ళూ తప్పలేదు. 1928లో స్థాపించిన ఈ పత్రిక స్వర్ణోత్సవాన్ని, వజ్రోత్సవాన్నీ కూడా జరుపుకుంది. ఆదర్శాల వెలుగును నింపుకున్న ఈ పత్రికకు దాన్ని నడుపుతున్న వారి అంకితభావం

శ్రీరామ రక్ష. ఇప్పుడు త్రివేణి భావరాజు నరసింహారావు సారథ్యంలో హైదరాబాదునుంచి వెలువడుతున్నది.

'త్రివేణి'కి రాసిన వారిలో కుందుకూరి ఈశ్వరదత్తు (1898-1967) స్వరాజ్యలో సబ్ ఎడిటర్‌గా పనిచేశాడు. అలహాబాదు నుంచి ఆయన 'ట్వంటీ యత్ సెంచరీ' అనే మాసపత్రికను నడిపాడు. 'హిందూ', 'ది లీడర్' పత్రికల్లో ఉప సంపాదకుడుగా పనిచేశాడు. అలాంటి ఉద్యోగాలన్నీ చేశాకనే పీరియాడికల్స్‌లో ప్రవేశించాడు. ఇంగ్లీషు జర్నలిజంలో ఆయన అసమాన ప్రతిభ గడించాడు.

ప్రముఖులను గురించి పద చిత్రాలు రాయడంలో ఆయన ఘనుడనిపించుకున్నాడు. ఎ.జి. గార్డినర్‌లా 'స్పార్క్స్ అండ్ ఫ్యూమ్స్' అనే సంకలనం ప్రచురించాడు. ఆల్ఫా- లిండ్ సంప్రదాయం నుంచి స్ఫూర్తిని పొంది ఆయన వైయక్తిక వ్యాసాలు రాశాడు. 'లీడర్', 'పయనీర్' 'హిందూస్తాన్ టైమ్స్' పత్రికలకు సంపాదకీయాలు రాశాడు. అవి ఎంతో చైతన్యవంతంగా, పఠనీయంగా ఉండేవి. 1937 ఎన్నికల కాలంలో మదరాసునుంచి వెలువడిన 'పీపుల్స్ వాయిస్' దిన పత్రికకు సంపాదకత్వం వహించాడు. లండన్‌లోని పత్రికల కార్యాలయాలున్న 'ఫ్లీట్ స్ట్రీట్'ని మనస్సులో పెట్టుకొని ఆయన చక్కని ఆత్మకథ రాశాడు. దానిపేరు 'ది స్ట్రీట్ ఆఫ్ ఇంక్'. ఫిలిప్ గిబ్స్ రాసిన 'ది స్ట్రీట్ ఆఫ్ ఎడ్వెంచర్' గుర్తుకొస్తుంది. ఆయనకు జర్నలిజం వృత్తిలో చింతామణి గురువు. రాజకీయాలలో సర్ తేజ్ బహదూర్ సప్రూ మార్గనిర్దేశకుడు, చేరదీసి ఆదరించినవాడు సర్ మీర్జా ఇస్మాయిల్.

'న్యూ స్టేట్స్‌మన్' తరహాలో ఆయన కొన్నాళ్ళు 'ది వీక్ ఎండ్' పత్రిక ప్రచురించాడు. ఆఖరున 'న్యూ ఇండియా' వారపత్రికను ప్రారంభించాడు. కాని దాన్ని ఎక్కువకాలం బతికించుకోలేక పోయాడు. 'కాంగ్రెస్ సర్వస్వం' అనే బృహద్గ్రంథ రచనకు ప్రయత్నించాడు. కాని అదీ పూర్తి కాలేదు.

శైలిలో ఈశ్వరదత్తుకు చాలా భిన్నమైన వాడు సి.వి.హెచ్. రావు. ఆయన కూడా చాలాచోట్ల పనిచేశాడు. తళుకు బెళుకులు లేవుగాని నిలకడగా ఉంటాడని, ఉపయోగ పడతాడని ఆయనకు పేరుండేది. ఆర్థిక రాజకీయ శాస్త్రాలను అధ్యయనం చేసిన రావు పాట్నానుంచి వెలువడే 'ది ఇండియన్ నేషన్' పత్రికకు సంపాదకత్వం వహించాడు. లాహోర్ నుంచి వెలువడిన 'ది డైలీ హెరాల్డ్'కు మద్రాసు నుంచి వెలువడిన 'ది ఇండియన్ రిపబ్లిక్'కు కూడా సంపాదకుడుగా పనిచేశాడు. ఆయన ఉమ్మడి మదరాసు ప్రభుత్వ సమాచారశాఖ డైరెక్టరుగానూ, కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖలోనూ ఉద్యోగం చేశాడు. హైదరాబాదులోని 'ఇన్‌ఫా' (INFA) లోనూ పనిచేశాడు. బాగా కష్టపడి పని చేసేవాడు. ఆయన పనితీరులో ఒక పద్ధతి ఉండేది. ఎక్కడ పనిచేసినా నమ్మదగిన వాడుగా పేరు తెచ్చుకొనేవాడు.

పాతకాలపు ప్రసిద్ధుల్లో ఒకరు సి.ఎల్.ఆర్. శాస్త్రి. కొద్ది సంవత్సరాల క్రితం ఆయన బొంబాయిలో తన 90వ ఏట మరణించాడు. ఈశ్వరదత్తు లాగానే శాస్త్రిమీద కూడా 20వ శతాబ్ది తొలిదశకం, 19వ శతాబ్ది చివరి దశకం 'ఫ్లీట్ స్ట్రీట్' పత్రికల ప్రభావం ఉండేది. తన జీవితంలో చాలాకాలం ఏ పత్రికతోనూ శాశ్వతానుబంధం పెట్టుకోకుండా 'ఫ్రీలాన్స్' జర్నలిస్టుగానే బతికాడు. స్వయానా చింతామణి పెద్దకొడుకే అయినా తండ్రితోగాని, ఆయన పత్రికతోగాని ఎలాంటి ప్రమేయాన్ని పెట్టుకోలేదు. అవసరం కొద్దీ జర్నలిస్టు అయినవాడు

కాడు. కావాలని జర్నలిస్టు అయ్యాడు. శిక్షణ లేదుగాని నైపుణ్యం ఉంది. ఆంగ్లసాహిహత్యంలో 'క్లాసిక్స్' అనదగిన గ్రంథాలను ఆపోసన పట్టాడు. సాహిత్యవాసన కలిగిన వ్యాసాలను పుక్కిట పట్టాడు. జాన్ మోర్లీ, డబ్ల్యు-టి. స్టెడ్ , టి.పి.ఓ. కోనర్ రచనలు ఆయనకు కరతలా మలకం. కింగ్స్‌లే మార్టిన్, ఆయన తరువాతి వారు నడిపిన దానికంటే క్లిఫోర్డ్ షార్ప్ సంపాదకత్వం వహించిన 'న్యూ స్టేట్స్ మన్' అంటే ఇష్టపడేవాడు. ఈ పత్రిక పాత సంచికలంటే ఆయనకు వేదమే. ఆయన తనకు తానై ఏర్పరచుకున్న శైలి ఆయన రచించిన జర్నలిజం అనే ఉద్గ్రంథంలో కనిపిస్తుంది. నలభైలలో ప్రచురించిన ఈ గ్రంథం నిండా సాహిత్య సౌరభాలే. రాజకీయ అభిప్రాయాలతో గాని, జర్నలిజం ప్రమాణాలతోగాని ఆయన రాజీ పడేవాడు కాదు. ఒంటరిగా పోవలసివచ్చినా సరే అనేవాడు. కనుకనే అంత ప్రతిభ ఉండీ అవ్యవస్థితమైన ఈ వృత్తిలో లబ్ధి పొందలేకపోయాడు.

కొన్ని విధాల చింతామణిని పోలిన ఒకే ఒక జర్నలిస్టు ఎం. చలపతిరావు - చింతామణి అలహాబాదులో ప్రకాశిస్తే అదే రాష్ట్రంలోని మరొక నగరం లక్నోలో మంచిపేరు తెచ్చుకు న్నాడు ఈయన. నేషనల్ హెరాల్డ్ ప్రతికకు నిరంతరాయంగా ముప్పదేండ్లకాలం సంపాదకు డుగా పనిచేశాడు. తరువాత కొంతకాలం 'ఫ్రీలాన్స్' రచయితగా చాలా పత్రికలకు ఎన్నెన్నో వ్యాసాలు రాశాడు. ఎక్కడ రాసినా ఆయన వ్యాసాలు బహుజనాదరణ పొందేవి. 1983లో ఢిల్లీలో ఉండగా ఎక్కడో దారిపక్క ఒక టీస్టాల్ లో ఆయన ఆకస్మికంగా మరణించాడు.

పత్రికా రచనారంగంలో ప్రయోజనాత్మకంగా అవిశ్రాంతంగా కృషి చేస్తూ కలం దించకుం డానే తనువు చాలించారాయన. సాహిత్యం, న్యాయశాస్త్రం చదివి జర్నలిజంలోకి వచ్చిన చలపతిరావు రాయని విషయమంటూ లేదు. ఆలోచనా నైశిత్యంలోనూ వ్యక్తీకరణ సౌలభ్యం లోనూ 'ద హిందూ' పత్రికలో పనిచేసిన ఎన్. రఘునాథ్ అయ్యర్‌తో పోల్చదగిన శైలి. వ్యంగ్య రచనలోనూ, సరళమైన కవితలోనూ కూడా ఆయన చేయి తిరిగినవాడు. 'త్రివేణి' పత్రికలో వ్యాసాలు రాసి వెలుగులోకి వచ్చిన చలపతిరావు కొంతకాలంపాటు ఈశ్వరదత్తుతో కలిసి 'వీక్ ఎండ్ 'లోనూ 'పీపుల్స్ వాయిస్'లోనూ పనిచేశాడు. విదేశీ వ్యవహారాలు ఆయనకు కొట్టిన పిండి. నెహ్రూతో కలిసి పనిచేసిన సంవత్సరాలు ఆయనకు మరపురాని మధురయుగం. నెహ్రూ ఆయనకు ఆరాధ్యుడు, పథ నిర్దేశకుడు. ఉభయులూ పరస్పరం నచ్చినవారు. కాని, భారత విదేశాంగ విధానాన్ని రూపొందించడంలో తానుకూడా బాధ్యుడ నని ఎం.సి. అనుకుంటే అది తనను తాను వంచించుకోవడమే అవుతుంది. ఆయన తన సంపాదకీయాలలో బరువైన విషయాలు చెప్పేవాడు. చెప్పేది పదునుగా చెప్పేవాడు. శైలి విలక్షణంగానే ఉండేది. కాని, వాటిల్లో ఒక స్పష్టమైన మార్గదర్శకత్వం కాని, ఏదైనా ఒక విషయాన్ని తేల్చి చెప్పటం కాని ఉండేది కాదు. తెలిసో, తెలీకో ఆయన నెహ్రూ ప్రభావానికీ, ఆయన కుటుంబ ప్రభావానికీ లోనవుతుండేవాడు. విధాన విషయాలలో నెహ్రూకు గానీ ఆ మాటకొస్తే మరెవరికైనా గానీ ఇదీమార్గం అని చెప్పినవాడు కాదు.

చలపతిరావు కొన్నివేల సంపాదకీయాలు రాసుంటారు. అవన్నీ 'నేషనల్ హెరాల్డ్' పాత ఫైళ్ళలో నిక్షిప్తమై మరుగున పడున్నాయి. రెండు విషయాలకు ఆయన్ని తప్పక జ్ఞాపకం వుంచుకోవలసి ఉంటుంది. మొదటిది వర్కింగ్ జర్నలిస్టులకోసం ఒక ట్రేడ్ యూనియ న్ని నిర్వహించడం; ప్రెస్ కమిషన్‌ను ఏర్పాటు చేయించడం. వర్కింగ్ జర్నలిస్టుల

స్థితిగతులను మెరుగు పరచడానికి వేతన సంఘాన్ని సాధించడం. రెండవది సాహిత్య విలువలతో కూడిన జర్నలిజాన్ని అభిమానించే వాడు. శంకర్స్ వీక్లీలో. ఎం.సి. అనే పొడి అక్షరాలతో ఆయన చేసిన వ్యంగ్య రచనలను విశిష్ట పద చిత్రణలకు ప్రతీకగా ఆయన్ని జ్ఞాపకం పెట్టుకుంటారు. 'హిందూస్తాన్ టైమ్స్'లోవారం వారం 'మేగ్నస్' పేరిట ఆయన రాస్తుండిన 'ఆఫ్ ద రికార్డ్' కాలమ్ చాలా బాగుండేది.

ప్రజారంగంలోని పలువురితో పరిచయాలుండి అదే గొప్ప సంపదగా రాణించిన మరొక రచయిత ఏలూరుకు చెందిన పి. రాజేశ్వరరావు. వృత్తిచేత న్యాయవాది; పుంఖాను పుంఖంగా రాసేవాడు. విజ్ఞాన ఖని. అన్నిటికీ మించి ఆయనకు అపారమైన జ్ఞాపకశక్తి ఉండేది. విలువైన సమాచారంతో చదివించే వ్యాసాలు రాసేవాడు.

మరొక రచయిత వి. పతంజలి. ఢిల్లీలో ఉండేవాడు. ఆయన సాంస్కృతిక విషయాలమీద రాయటంలో సిద్ధహస్తుడు. టి.వి. వార్తారంగంలోకి కూడా ఆయన ప్రవేశించాడు. కాని, ఉద్యోగ విరమణ చేసిన కొద్దికాలానికే మరణించాడు.

ఒక 'ఫ్రీలాన్స్' రచయితగా గాని, ఒక మేగజైన్ సంపాదకుడుగా గాని డా॥ ఎ.ఎస్. రామన్ అనితర సాధ్యమైన స్థానాన్ని సంపాదించాడు. ప్రభుత్వం ప్రచురించే వివిధ పత్రికల్లోనూ 'అవర్ ఇండియా'లోనూ పనిచేసిన తరువాత సి.ఆర్. మండి స్థానంలో 'ద ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ' పత్రికకు సంపాదకుడై గొప్ప ఖ్యాతి గడించారాయన. శిల్ప, నృత్య, చిత్ర కళాది వివిధ కళా ప్రక్రియలను ప్రోత్సహించారు. వర్ధమాన చిత్ర కళాకారులు, శిల్పులు, సంగీత శాస్త్రవేత్తలు నర్తకులు - ఎందరికో ఆయన ప్రాచుర్యం కల్పించాడు. వీక్లీలో ఆయన రాసిన 'క్యరో స్కురో', 'స్వరాజ్య'లో రాసిన 'ఫస్ట్ పర్సన్ సింగ్యులర్' బహు జనాదరణ పొందాయి. నిశితమైన అభిప్రాయాలు విస్పష్టమైన అవగాహనతో ఆయన ఎన్నో విషయాలను ఈ ఫీచర్లలో రాస్తుండేవాడు. ఒక సంవత్సరకాలం (1992) మదరాసు నుంచి వెలువడిన సాయంకాల పత్రిక 'ఈవినింగ్ మెడ్రాస్'కు సంపాదకత్వం వహించాడు.

ఒక దశాబ్దం కిందట 'లింక్' పత్రికకు సంపాదకుడుగా పనిచేసిన ఎం. వేణు గోపాలరావు పత్రికను, సైద్ధాంతిక దృక్పథం కలిగినదైనప్పటికీ, చదివించేదిగా చేశాడు. ఆయన అక్కడ పనిచేసింది కొన్ని సంవత్సరాలే - ఆరితేరిన పాత్రికేయుడుగా ఒక న్యూస్ మేగజైన్ నడపడంలో వార్తలకు వ్యాఖ్యలకు మధ్య సమతౌల్యాన్ని సాధించాడాయన.

యువతరానికి చెందిన పాఠకుల దృష్టిని ఎలా ఆకర్షించాలో తెలిసిన చురుకైన యువతరం జర్నలిస్టులలో ఎస్. వెంకటనారాయణ (వెంకట్) ఒకరు. 'ఆన్ లుకర్' ఎక్జిక్యూటివ్ ఎడిటర్‌గా, తర్వాత 'ఇండియా టుడే'లోనూ పనిచేశారాయన. ఐ.ఇ.ఎన్.ఎస్. ప్రచురించిన 'ద ఇండియన్ ప్రెస్'ను తీర్చిదిద్దారు. దురదృష్టంకొద్దీ ఇప్పుడా పత్రికలేదు. పత్రికల్లోనే గాక రేడియో, టి.వి. కార్యక్రమాల్లో పాల్గొన్న బహుముఖ ప్రజ్ఞావంతుడు. ఇప్పుడెక్కడా ఉద్యోగం చేస్తున్నట్లు లేదు. వివిధ పత్రికలకు రాస్తున్నాడు.

ఎడిటర్లు, సబ్ ఎడిటర్లుకాక మరింత విస్తృతమైన న్యూస్ రిపోర్టర్స్ రంగానికి వస్తే ఒక తరం కిందటి డా॥ పి.జి. కృష్ణయ్య జ్ఞాపకానికొస్తాడు. తన పేరు మీదనే న్యూయార్క్‌ నుంచి ఒక వార్తా సంస్థను నడిపాడు. బోగీ చదువుకొన్నవాడు. చాలా మందితో పరిచయమున్నవాడు.

స్పెషల్ కరస్పాండెంట్‌గా పనిచేసిన వారిలో 'ద హిందూ' పత్రికకు ఢిల్లీలో న్యూస్ బిరో అధిపతిగా పనిచేసిన జి.కె. రెడ్డి అత్యంత ప్రసిద్ధులు. ప్రతిరోజూ పత్రికలో ఆయన పేరుతో వార్తా వ్యాఖ్యలుండేవి. అలా ఆయన అత్యంత ప్రముఖ వ్యక్తుల్లో ఒకడైనాడు. ఆయన సాహసయాత్ర 'బ్లిట్జ్'తో ప్రారంభమై 'టైమ్స్ ఆఫ్ ఇండియా' మీదుగా 'ద హిందూ'లో పనిచేయడంతో ముగిసింది. రాజకీయ వ్యాఖ్యలను కాలాలకు కాలాలు ఎంత చదివినా తనివితీరని పద్ధతిలో రాశాడు. సాగదీసినట్లు కనిపించినా అలంకారాలెన్ని ఉన్నా స్పష్టంగా కళ్ళకు కట్టినట్లు చెప్పడం ఆయన విశిష్ట శైలి.

అంతగా వెలుగులోకి రాకపోయినా సామర్థ్యంలో తీసిపోని మరొకరు సి. సుబ్బారావు. నిజాయితీ పరుడని, కష్టపడి పనిచేస్తాడని ఆయన్ను చాలా గౌరవించేవారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' న్యూస్ సర్వీసులో పనిచేసేవాడు. స్పెషల్ కరస్పాండెంట్‌గా పనిచేసిన వారిలో వి.జి. ప్రసాదరావు స్వర్గీయ వి.వి. ఆర్ శర్మ చాలా అప్రమత్తంగా ఉండేవారు. తిరుగులేని వార్తల్ని పంపేవారు. 'ద హిందూ' పత్రికలో సీనియర్ డిప్యూటీ ఎడిటర్ ఎం. పట్టాభిరాం పత్రికా రచనలో బహుముఖ ప్రజ్ఞాశాలి. బాగా చదువుకొన్నవాడు. నిగ్రహం, లక్ష్యశుద్ధి, పరిణతి కలిగిన పట్టాభిరామ్ ఏది రాసినా దాన్ని తిరిగి చూడాల్సిన అవసరముండదు. 'హిందూ' శైలికీ, సంప్రదాయాలకూ అతికినట్లు సరిపోయే సంపాదకీయాలు రాస్తున్నాడు.

ఢిల్లీలోనూ ఇంకా ఇతరచోట్ల ఇంగ్లీషు జర్నలిజం వృద్ధికి దోహదం చేసిన మిగతా ఆంధ్రుల్లో గణనీయులు జి.ఎస్. భార్గవ, స్వర్గీయ వి.వి. ప్రసాద్.

భార్గవ భారతీయ రాజకీయాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు. చాలా పత్రికల్లో పనిచేసి 1977-79 మధ్య జనతా పాలనలో కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసరుగా పనిచేశాడు. తర్వాత హైదరాబాదులో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు రెసిడెంట్ ఎడిట రుగా పనిశారు.

సాహిత్యానుభవం కలిగిన వి.వి. ప్రసాద్ సాంస్కృతిక రంగంలో వ్యాసాలు రాసి ప్రత్యేక నైపుణ్యాన్ని సంపాదించారు. పాత తరానికి చెందినవాడు. రంగస్థల కళలపట్ల ఆయనకు ఆసక్తి మెండు. 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్'లో నాటకాలనూ, నాట్యాలనూ విశ్లేషిస్తూ రాసేవాడు. ఆయన కాలంచేసి కొద్ది సంవత్సరాలైంది.

యువతరం జర్నలిస్టులలో కొందరు వెనుకటి తరాల వారిలాగా కీర్తి గడించలేదంటే అది వారి లోపం కాదు. ఇప్పుడు అవకాశాలు విస్తృతం. గతంలో వలె కాకుండా ఇప్పుడు చాలా మందికి ధారాళంగా 'బైలైన్' ఇస్తున్నారు. 'బ్లిట్జ్'లో చివరి పేజి రాస్తున్న పాలగుమ్మి సాయినాథ్ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లోని వెంకటేశ్వరరావు పర్సా (జూనియర్) ఎన్న దగినవారు.

పత్రికలిప్పుడు గొప్ప పరిశ్రమలుగా అభివృద్ధి చెందాయి. పెద్ద పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టు ఆ మహాసంస్థల్లో ఎక్కడో ఉంటారు. వెనుకటి తరాలవారి వైయక్తికమైన అగ్గిబ రాటా సాహసాలకు ఇప్పుడు ఆస్కారం లేదు. ఇప్పుడు కావలసింది విషయ పరిజ్ఞానంతో కూడిన చర్చ; నిర్మాణాత్మక సూచన. అత్యాధునిక యంత్ర పరికరాల ప్రాబల్యం కల్గిన ఈనాటి పత్రికారంగంలో ఏదో ఒక విషయంలో ప్రత్యేక నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం అవసరం. ★

# తెలుగు సాహిత్యంలో
# అస్తిత్వవాదం

- ఆర్.ఎస్. సుదర్శనం

వ్యక్తి ప్రవృత్తికీ వ్యవస్థకూ మధ్యగల అంతరము అనాదినుంచీ ఉన్నదే. సమాజంలో ఒకడై ఉంటున్నవ్యక్తి తన ప్రవృత్తిని వ్యవస్థాబద్ధం చేసుకొని ప్రవర్తనను రూపొందించుకోవాలని సమాజం నిర్దేశిస్తుంది. అందుకై రూపొందినవి విద్యాబోధ, ధర్మప్రబోధము, మతప్రచారము, సంప్రదాయసిద్ధమైన ఆచారాలూ, కట్టుబాట్లు, వంశగౌరవం, కుటుంబగౌరవం వంటివి. ఆచరణలో వ్యక్తి, వ్యవస్థ నిర్దేశించిన ఆదర్శాన్ని అందుకోలేకపోతాడు. అప్పుడు తీర్పు ఎలా ఉంటుంది? ఎలా ఉండాలి?

గీతాకారుడంటాడు -

> "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
> స్వభావ నియతమ్ కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్"

ఇక్కడ స్వధర్మమంటే వ్యక్తి ధర్మము, పరధర్మమంటే వ్యవస్థ నిర్దేశించే ధర్మము, స్వభావనియతమైన విధంగా వ్యక్తి తన ధర్మాన్ని నిర్వర్తిస్తే దానిలో దోషం లేదనే అంటాడు. ఇది మానవవ్యక్తి యొక్క నైజాన్నీ, వ్యక్తిలో పెరుగుదల, వికాసం ఎలా అయితే సాధ్యమో ఆ జీవరహస్యాన్నీ తెలుసుకొని అన్నమాట.

అస్తిత్వవాదం (Existentialism) యిక్కడే ప్రారంభమౌతుంది. వ్యవస్థకంటె వ్యక్తిధర్మానికి - అంటే వ్యక్తి వైశిష్ట్యానికీ, స్వేచ్ఛకూ, సహజవికాసానికీ, ప్రాధాన్యాన్నిస్తుంది అస్తిత్వవాదం.

కర్క్‌గార్డ్ (1813-55) యీ వాదానికి మూలపురుషుడు. రాజ్యవ్యవస్థతో, సాంఘిక వ్యవస్థతో, మతవ్యవస్థతో, సృష్టిలో మానవుని ప్రతిపత్తిని గురించి మేధావంతులూ శాస్త్రజ్ఞులూ నిర్మిస్తున్న ఊహావ్యవస్థలతో, వ్యక్తి తాదాత్మ్యానికి ప్రయత్నించి, భంగపడి, వ్యక్తిగా ఆత్మవంచనకూ, ఆత్మనైచ్యానికి పాల్పడ్డం ఆయన గుర్తించాడు. వ్యక్తి మాటలకూ చేతలకూ సంబంధంలేకపోవడం ఆయన గమనించాడు. "The philosopher of system is, as a man, like someone who builds a castle, but lives next door in a shanty ... ... the thought of a man must be the house in which he lives, or it will become perverted" ఆలోచనకంటె అనుభూతి ప్రధానం. ఆ అనుభూతి స్వరూపాన్ని చిత్తశుద్ధితో గ్రహించే ఆత్మపరీక్ష ముఖ్యం. మనోవాక్కాయ కర్మల్లో ఏకత్వాన్ని సాధించడమే చిత్తశుద్ధితో జీవించడం (to live authentically), అదే వ్యక్తిగా రూపొందడం (to become a person), వ్యక్తి తన చేతలకు, నిర్ణయాలకు బాధ్యత వహించడం. ఇక్కడ కీలకం వ్యక్తికి ధర్మనిర్ణయం కర్మణ్యా తన అస్తిత్వ వైశిష్ట్యంమీద ఆధారపడాలికాని, సిద్ధాంతంమీదా, వ్యవస్థమీదా కాదు. హేతుబద్ధమైన ఆలోచనమీదకాదు; తాత్కాలికమైన ప్రేరణమీదకాదు. ఇవన్నీ అస్తిత్వానికి

ఉపాంగాలేకాని ప్రాథమికంకావు. వ్యక్తి అంతరాంతరాల్లోంచి ఉద్భూతమై, వ్యక్తిని ముందుకు నడిపించే అతని వైశిష్ట్యాన్ని 'అస్తిత్వం' (existence) అన్నాడు కర్క్‌గార్డ్. ఈ అస్తిత్వ నిర్వచనం ఆయనచేసిందే. ఇటువంటి ఆత్మజ్ఞాన పరమైన అస్తిత్వం మనిషికే ఉన్నది. జంతువులకు లేదు.

కర్క్‌గార్డ్ ఆస్తికుడు, క్రైస్తవసాధకుడు. భగవంతుడూ, క్రీస్తు మూర్తీ బయటలేరు, అంతర్యంలో అనుభూతిలోనే ఉన్నారు. భగవదన్వేషణా, వ్యక్తి జీవితమూ ఒక్కటేనని ఆయన అభిమతం. కర్క్‌గార్డ్ అంతర్ముఖత్వానికి ప్రాధాన్యం యిచ్చాడు.

నీట్షే (1844-1900) వ్యక్తి సంకల్పానికి (will) ఎక్కువ ప్రాధాన్యం యిచ్చాడు. సంక ల్పాన్ని అస్తిత్వపు లోతుల్నుంచి దృఢపరచుకోవడంద్వారా వ్యక్తిధర్మానికి భిన్నమైన ధర్మా లను ఎదుర్కొని వాటికి లోబడక స్వధర్మ సాధన చెయ్యడానికి వీలవుతుందన్నాడు. కర్క్‌గార్డ్‌వలె నిజాయితీకి (authenticity) స్వయం నిర్ణయత్వానికి ప్రాధాన్యం యిచ్చినా, అంతర్ముఖత్వానికి బదులు కార్యోన్ముఖతను నీట్షే బోధించాడు. సృజనాత్మక శక్తులద్వారా విలువల్నీ, తనదైన ప్రపంచాన్నీ వ్యక్తి నిర్మించుకోవాలని ఆయన అభిమతం. నీతి, ధర్మం, వ్యక్తి అస్తిత్వానికి సంబంధించిన అభివ్యక్తి మాత్రమే, వాటికి ప్రాథమికమైన విలువలేదు!

ఇరవయ్యో శతాబ్దపు అస్తిత్వవాదుల్లో మార్టిన్ హైడెగర్, యాస్పర్స్, సార్త్రే, కేమూ, పాల్ టిల్లిచ్, గేబ్రియల్ మార్సెల్, బార్త్, మార్టిన్ బూబర్ ప్రముఖ దార్శనికులు. వీరిలో ఆస్తికులూ ఉన్నారు, నాస్తికులూ ఉన్నారు. సార్త్రే నాస్తికుడు, పాల్ టిల్లిచ్ ఆస్తికుడు. వీరందరూ దార్శనిక గ్రంథాలు వ్రాసినవారు. కాని సాహిత్యపరంగా అస్తిత్వవాదానికి ప్రాభ వాన్నీ ప్రాచుర్యాన్నీ తెచ్చిన రచయితలు సార్త్రే, కేమూ. ఇద్దరికీ నోబెల్ బహుమతి లభించింది. సార్త్రే బహుమతి స్వీకరించలేదు.

సార్త్రే అస్తిత్వవాద దృక్పథంలో ప్రధానమైన అంశం వ్యక్తి స్వేచ్ఛ. సార్త్రే వ్యక్తి హృదయం లోని పారమార్థికాన్వేషణను గుర్తిస్తాడు, కాని యీ అన్వేషణకు గమ్యం లేదంటాడు. గమ్యమని ఊహించుకునే భగవంతుడు ఒక వ్యవస్థ. ఒక భావం, ఒక కల్పన. అందువల్ల అది మానవుని అస్తిత్వాన్నీ, దాని లక్షణమైన స్వేచ్ఛనే భంగపరిచే ఆత్మవంచన తప్ప మరేమీ కాదంటాడు. అతని దృష్టిలో అన్వేషణకు సార్థకత కేవలం అన్వేషణే తప్ప మరొకటి కాదు.'Man is a useless passion'. వ్యక్తిలో స్వేచ్ఛ ప్రధానం కాబట్టి, బాధ్యత, నిజాయితీ కూడా ప్రధానం అవుతాయి. నైతికసూత్రాలు కాని, మానవత్వపు విలువలుకాని వ్యక్తి తన అస్తిత్వంనుంచి కర్మణ్యా సృష్టించుకునేవే! (Existence precedes essence).

అస్తిత్వాన్ని మూడు పొరలుగా విశ్లేషిస్తాడు సార్త్రే. 'Being in itself' తనలో తను; 'Being for itself' తనకై తను; Being for others' ఇతరులకోసం తను. 'తనలో తను' అస్తిత్వంలో ఏకత్వం, అద్వైతం ఉన్నది. 'తనకై తను'లో ద్వైతం ఉన్నది. అంటే తన్ను వేరుగా ఒక వస్తువుగా చూడటం. ఇక్కడ తన్ను గూర్చిన ఆలోచనకు, ఊహకు, కల్పనకు అవకాశం ఉన్నది. ఇక్కడ ఆత్మజ్ఞానానికీ, ఆత్మవంచనకీ కూడా అవకాశం ఉన్నది. 'ఇతరులకోసం తను'లో ఇతరుల దృష్టిలో తన్నుగూర్చిన అభిప్రాయం ఏమి ఉన్నదో దాన్ని ఊహించడం వల్ల, దాని ప్రభావంవల్ల, ప్రవర్తనను అలా రూపొందించుకోవటం. ఇక్కడ స్వేచ్ఛపోయి వ్యక్తికి జడత్వం (becomes a thing), బానిసత్వం, పరప్రత్యయనేయబుద్ధి వల్ల వినాశనం,

శైథిల్యం సంభవిస్తాయి. వ్యక్తి (being in itself) 'తనలో తను' స్థాయినుంచి జీవించినప్పుడే నిజాయితీ, బాధ్యత, స్వేచ్ఛ అనే విలువలు సిద్ధిస్తాయి. సామాజికుడైన మానవునిలో ఈమూడు పొరల అస్తిత్వమూ ఉంటూనే ఉన్నది. ఎవరూ దాన్ని తప్పించుకోలేరు. ఏది ప్రాధాన్యం వహిస్తున్నదన్న విషయమే కీలకం.

పాల్ టిల్లిచ్ అస్తిత్వవాదంలో మూడు రకాలైన అస్తిత్వవేదనలను (Existential Anxieties) పేర్కొని, వాటికి ప్రాముఖ్యం యిస్తాడు. (1) విధి - మృత్యువు: ఎప్పుడు ఏమౌతుందో అన్న భయం, మృత్యువు తప్పదన్న స్పృహ (2) శూన్యము - నిరర్థకత : ఎప్పుడూ ఏదో చెయ్యాలనే ఆదుర్దా, చేస్తున్న దానికి అర్థమేమిటన్న ప్రశ్న (3) పాపము - శిక్ష : చేస్తున్నది తప్పు, పాపం అనే ఆదుర్దా, దానికి శిక్ష ప్రత్యాఖ్యానము అనే భయం. ఈమూడు రకాల వేదనలూ వ్యక్తి అస్తిత్వానికి బంధనాలు. విముక్తిమార్గం, నమ్మకమూ ధైర్యమూ ఒకటై వేదనల్ని ఎదుర్కొనటంద్వారా, మనస్సుని భగవత్తత్త్వంవైపు మళ్ళించడముద్వారా, సిద్ధించే అస్తిత్వమే! అస్తిత్వ వేదనలే ద్వారం తెరచి భగవత్సాక్షాత్కారం చేయిస్తాయి. వేదనా జన్యమైన నిరతిశయ దైన్యాన్ని (despair) ఆకళించుకొని దానితో తాదాత్మ్యం పొందటంద్వారా దాన్ని అధిగమించిన మానవ అస్తిత్వం భగవత్తత్వాన్ని చేరుకుంటుంది. భగవన్మూర్తిని ధ్యానించే స్థితి కేవలం మానసికమైనది. భగవదైక్యంపొందే అస్తిత్వం మనస్సును అధిగమించి మనస్సు కావలే ఉంటుంది. అది అనిర్వాచ్యము. దాన్నిలా వర్ణిస్తాడు టిల్లిచ్ :-

"It is both the courage of despair and the courage in and above every courage It is not a place where one can live, it is without the safety of words and concepts, it is without a name, a church, a cult, a theology. But it is moving in the depth of all of them. It is a power of being in which they participate and of which they are fargmentary expression."

పాల్ టిల్లిచ్ దృక్పథంలో వ్యక్తికి ముఖ్యమైనవి ధైర్యమూ, విశ్వాసమూ, వాటిద్వారానే అస్తిత్వ సిద్ధి.

ప్రముఖ అస్తిత్వవాదుల వివరణలద్వారా యీ వాదంలో భిన్న దృక్పథాలకు ఎలా అవకాశం ఉన్నదో గమనించాము. వ్యక్తివైశిష్ట్యాన్ని గుర్తించి, మానవుల్లో ఒక్కొక్క వ్యక్తికీ అనిర్వచనీయమైన వ్యక్తిత్వం ఉన్నదనీ, దాని అభివ్యక్తి భిన్నంగా ఉండక తప్పదనీ, తద్ద్వారా వ్యక్తి జీవితమూ, ప్రవర్తనా, వ్యవస్థను వ్యతిరేకించినప్పుడు, వ్యక్తిధర్మాన్నే ఉత్కృష్టమైన విలువగా అంగీకరించి, వ్యక్తినే సమర్థించడం అస్తిత్వవాద దృక్పథంయొక్క సారాంశం.

ఈ దృక్పథం క్రమంగా విస్తరించి ప్రస్ఫుటమైన ఆధునిక సాహిత్యంలో ప్రాచుర్యాన్ని పొందటానికిగల కొన్ని కారణాల్ని పరామర్శ చేస్తాను. వైజ్ఞానిక విప్లవం (Scientific Revolution), పారిశ్రామిక విప్లవం (Industrial Revolution) వ్యాప్తి చెందడంతో సంప్రదాయ బద్ధమైన మతవిశ్వాసాలూ, సామాజిక నియమాలూ సడలిపోయి శైథిల్యం చెందుతూ వచ్చాయి. పూర్వయుగంలో, మతంలోకాని సమాజంలోకాని వ్యవస్థా దృక్పథానికీ వ్యక్తి దృక్పథానికీ సమైక్యం (integration) విధాయకం. ఆ సమైక్యం విశ్వాసంమీదా, భక్తిప్రపత్తుల మీదా, భయంమీదా ఆధారపడినది. దానికి హేతువాదంతో, వ్యక్తియొక్క స్వయం వివేచనతో పనిలేదు. ఒకవేళ ఉన్నా, అటువంటి హేతువివేచన, తర్కం సంప్రదాయానికి విధేయంగా

జరగవలసిందే! అట్లా జరగని సందర్భాల్లో ఆ వ్యక్తి సమాజంనుంచి బహిష్కృతుడయ్యేవాడు, లేదా ఆ వ్యక్తి తన ప్రతిభతో సమాజాన్ని ఆకర్షించి, వ్యవస్థను సంస్కరించి, కొత్తబాటలు వేసి పూజ్యుడయ్యేవాడు. ఏమైనా వ్యవస్థకూ వ్యక్తికీ భిన్నమైన దృక్పథాలు ఉండటానికి వీల్లేదు. వైజ్ఞానికయుగంలో, హేతువాదం, స్వయంవివేచన ప్రాముఖ్యం వహించడంవల్ల, ఒక వ్యక్తి మనస్సుకూ మరియొక వ్యక్తి మనస్సుకూ సంబంధంఉన్నా సమైక్యం లేదు. ఆధునిక సమాజంలో మనుష్యుల సంబంధాలు పారిశ్రామిక విప్లవంవల్లా, వాణిజ్య విస్తృతివల్లా మరీ క్లిష్టమై సంకీర్ణం కావడంతో, జీవన విధానంలో వైవిధ్యంతోబాటు దృక్పథ భిన్నత్వమూ నిరవధికంగా పెరిగింది. ఈ పరిస్థితిలో జీవితాన్ని గూర్చి ఎవరి విశ్వాసాలూ విలువలూ వారివి అవుతున్నాయి. వాటికి తగినట్లే హేతువులు, వివేచనా, కర్తవ్యమూ ఉంటున్నాయి. ఇప్పుడు జీవితాన్నిగూర్చి సామాజిక దృక్పథానికీ ఏకస్వరూపం అంటూ లేకుండా పోతున్నది. ఉన్నంతమాత్రంలో దానికీ వ్యక్తి దృక్పథానికీ సమైక్యం ఏర్పడ్డం అసాధ్యం అవుతున్నది. పైకి ఏర్పడినట్లు కనిపించినా ఆచరణా అనుభవమూ వేరుగానే ఉంటాయి.

నేటి సామాజిక దృక్పథంలో, ఉదాహరణగా ముఖ్య విలువైన 'ప్రజాస్వామ్యాన్నీ' 'మానవ సమానత్వాన్నీ' తీసుకుంటే, ఇవి అందరూ అంగీకరించినవే. అయితేనేం! ఈ అంగీకారం కేవలం నినాదాలకు మాత్రమే పరిమితమనీ, ఆచరణలో ఒక్కొక్కవర్గం, ఒక్కొక్క వ్యక్తీ వీటికి ప్రత్యేకమైన అర్థాన్ని ఆపాదిస్తున్నారనీ అందరికీ తెలిసిన విషయమే! అలాగే సమాజంలో వివాహంవంటి వ్యవస్థగాని, ప్రేమవంటి ఆదర్శంగాని కొలబద్దగా తీసుకుని ఒక్కొక్క వ్యక్తి జీవితాన్నీ ఆచరణనూ పరామర్శించేందుకు పూనుకుంటే, ఒకవ్యక్తి వికాసానికి సుఖసంతోషాలకు ఆవ్యవస్థ లేక ఆదర్శం అవకాశం కావచ్చు. మరోవ్యక్తికి అదే అవరోధమో శాపమో కావచ్చు. బయటినుండి స్థూలంగా అందరి వ్యక్తుల విషయంలోనూ ఒకే కొలబద్దతో నైతికమైన తీర్పుచెయ్యడం చాల సులువు. కాని వ్యక్తి వైశిష్ట్యాన్నీ ప్రత్యేకమైన పరిస్థితులనూ గూర్చిన అవగాహన లేనిదే మన నైతికదృష్టికీ తీర్పుకూ ఏమి విలువ ఉన్నట్లు?

సాహిత్యపరంగా ఒక వ్యక్తి అస్తిత్వానికి ఏ నవలలోనో కథలోనో ఆవిష్కరణ జరిగినప్పుడు మాత్రమే ఆ అవగాహన సాధ్యమౌతున్నది. అటువంటి అవగాహన, దాని ఫలితమైన విశాలదృష్టి, సహనమూ, సానుభూతీ, నేటి సమాజంలో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య అవసరమౌతున్నవి. ఏమంటే ఈ సమాజంలో పూర్వయుగపు సామూహిక సమైక్యమనఃఫలకము ముక్కలు ముక్కలై, నేడు వ్యక్తులకు ఎవరిముఖం వారి ముక్కలో కన్పించడమే తప్ప యితరుల ముఖాలు సవ్యంగా కనిపించే మార్గం లేదు. ఒకవ్యక్తి అస్తిత్వానికి సంబంధించిన విలువలంటూ ఏవో ఉండవచ్చు అనే దృష్టి ముఖ్యమౌతోంది. ఒకవేళ సానుభూతిద్వారా ఆ వైయక్తికపు విలువల్ని గ్రహించే దృక్పథమైనా నేడు అవసరం. సమాజం మారింది. జీవితంలో వైవిధ్యం ఎంతో ఉన్నది. వ్యవస్థ గుర్తించిన జీవిత మార్గాలే తప్ప తక్కినవి ఉండటానికి వీల్లేదనే మొండిపట్టు పట్టడంవల్ల సాధించేది ఏమీలేదు. ఇతరులను బాధపెట్టడమూ, తన్నుతాను బాధపెట్టుకోవడమూ అవుతుందే తప్ప అది శాంతి మార్గముకాదు, బాధావిముక్తి మార్గమూ కాదు. అస్తిత్వవాద దృక్పథంతో నేటిసమాజానికి ఉన్న అవసరం యిదే!

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాద దృక్పథం అభివ్యక్తమైన రచనల్ని పరామర్శించే ముందు సాత్రే రచించిన ఒక కథను ఉదాహరిస్తాను. ఈ కథపేరు 'సాన్నిహిత్యం' (Intimacy). కథలో

భార్యాభర్తలు. ఇద్దరికీ చాలా అన్యోన్యం. భర్త నపుంసకుడు. కాని వారి అన్యోన్యానికి యిదేమీ అడ్డురాదు. భార్యకు భర్తమీద ఎంతో ఆప్యాయత, ప్రేమ, జాలి. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. ఈ సన్నివేశంలో భార్య స్నేహితురాలు ఆమెని విమర్శిస్తుంది. భర్తను వదలి తనకు తగిన మగవానితో లేచిపొమ్మని ప్రోత్సహిస్తుంది. జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దం టుంది. భార్యా భర్తలమధ్య ఒక చిన్న కలహంమూలంగా భార్య వెళ్ళిపోతుంది. వివాహానికి మూలమైన శారీరక సంబంధం భార్యాభర్తలమధ్య లేకపోవడంవల్ల భార్య మరో పురుషుణ్ణి వరించడం సమర్థనీయమే! అది చట్టమూ, సమాజమూ అంగీకరించే ధర్మమే. కాని కథలో తనకేది కావాలో ఆలోచించుకున్న ఆ భార్య చివరకు తన భర్త దగ్గరకే వచ్చివేస్తుంది. ఇక్కడ ఆమె భార్యకంటె, స్త్రీ కంటె, విశిష్టమైన వ్యక్తిగా, చేసుకున్న నిర్ణయం మనకు గోచరిస్తుంది. వ్యక్తి ధర్మం జయించింది. తెలుగులో చలంవంటి రచయిత, వివాహ వ్యవస్థమీద దండెత్తిన రచయిత యిలాంటి కథ వ్రాయగలడా? ఊహించండి. మన సంఘంలో వ్యవస్థా ధర్మమే పాతివ్రత్యం కావడంవల్ల, పాతివ్రత్యానికంటే 'సెక్స్' మానవతా సహజ ధర్మం కాబట్టి ఆ భార్య లేచిపోయిందనడమే చలం కథ ధ్యేయం అవుతుంది; ఎందుకు చెప్పవలసివచ్చిందంటే 'సెక్స్' సంబంధాల్లో 'స్వేచ్ఛ' అనే నినాదాన్ని తన రచనల్లో మొదటినుంచీ చివరిదాకా ఉద్యమంగా ప్రచారం చేసిన చలం, కాల్పనికవాదీ, సంస్కర్తా తప్ప; అస్తిత్వవాది కాడు. ఆయన సెక్స్ అనే సిద్ధాంతాన్ని చూచాడు. దాన్ని అందరికీ అన్వయించాడు. కాని వ్యక్తి వైశిష్ట్యంలోగల భిన్నత్వాన్ని చూడలేదు. సమాజంలో మతం, నీతి, సంప్రదాయం, నిర్దేశించిన వ్యవస్థా ధర్మం కంటె మానవత్వం ప్రధానమనేది ఒక మెట్టు. కాని యీ మానవత్వం 'సెక్స్', 'పేదరికం' వంటి ఒక సామాన్య లక్షణాన్నో, ఒక సిద్ధాంతాన్నో ఆధారం చేసుకున్నది మాత్రమే. దానికంటె వ్యక్తి అస్తిత్వ వైశిష్ట్యం ముఖ్యం అంటుంది అస్తిత్వవాదం. ఆ వైశిష్ట్యం ఏ రూపంలోనైనా ఉండవచ్చు. అది వ్యవస్థను సమర్థించేది కావచ్చు, వ్యతిరేకించేది కావచ్చు.

1947 ప్రాంతాల వెలువడిన 'అల్పజీవి' (రా.వి. శాస్త్రి) నవలలో ఆడ్లర్ మనస్తత్వ సిద్ధాంతం దృష్ట్యా సుబ్బయ్యపాత్రను రచయిత సృష్టించినా, ఆపాత్రలోని వ్యక్తి వైశిష్ట్యం, అనుభవాల చిత్రణ, అస్తిత్వ వాదాన్ని స్ఫురింపజేస్తాయి. హైడెగ్గర్ వ్యక్తి జీవితంలో అస్తిత్వపు లోతుల్ని స్పృశించే క్లిష్ట సన్నివేశాన్ని గూర్చి చెబుతూ, వ్యక్తి మృత్యువువంటి తీవ్రమైన అనుభవం ద్వారా పునర్జన్మ పొంది తనదైన జీవితాన్ని నిర్మించుకుంటాడు అంటాడు. భయంతో జీవించే ఎన్జీవో సుబ్బయ్యని గవరయ్య అనే కంట్రాక్టరు తన మనుష్యులచేత బలవంతంగా రప్పించి బెదిరించి ప్రామిసరీనోటుమీద సంతకం చేయిస్తాడు. బెదిరించే సన్నివేశంలో సుబ్బయ్య భయం తారస్థాయినందుకుని కొన్ని క్షణాలు తను చచ్చిపోతున్నానని మృత్యువే వచ్చినంత అనుభూతికి లోనవుతాడు. ఇంటికి వచ్చిన తర్వాత భార్యతో నిజం చెప్పలేక, అబద్ధం చెబుతూ, ఒక గాఢమైన జాగృతిని పొందుతాడు. సుబ్బయ్య తన అస్తిత్వపు సత్యాన్ని ఎదుర్కొని గుర్తించినట్లు సూచిస్తాడు రచయిత.

''చస్తున్నాను బాధపడుతున్నాను
చస్తూ బాధపడుతూ అబద్ధాలాడుతున్నాను
చావబోతూ అబద్ధం చెప్తూ చెప్తూ చస్తాను
చెప్పేది అబద్ధం, చావబోయేది నిజం
చావేకాదు ఈ బాధకూడా నిజం

నిజం కన్న నిజం చావుకన్న నిజం అబద్ధం కన్న నిజం యీ బాధ
మనిషి మాట అబద్ధం మనిషి బాధ నిజం
మనిషి చావు నిజం
అబద్ధపు బ్రతుకు బ్రతుకుతూ నిజం బాధలు పడుతూ
అతి నిజంగా చస్తాను''

ఈ చివరి వాక్యంలో వ్యక్తి సమాజంలో పొందే అస్తిత్వపు భంగపాటును గూర్చి అస్తిత్వ వాదులు వివరించిన దర్శనాల సారాంశం అంతా యిమిడి వుంది.

1947 ప్రాంతాల్లోనే వెలువడిన మరో నవల బుచ్చిబాబు వ్రాసిన 'చివరకు మిగిలేది'. దీన్ని చాలా ఆసక్తిగా పాఠకలోకం చదివారు. నవలలోని సందేశం ఏమిటో నీతి ఏమిటో బోధపడక ఈ నవలలో మిగిలేదేమీ లేదు, చివరకు అట్టలు కూడ మిగలవు అంటూ విమర్శించారు. దయానిధి పాత్ర ఫ్రాయిడ్ ఈడిపస్ కాంప్లెక్స్ సిద్ధాంతం మీద నిర్మింపబడిందని ఒక దృష్టితో వ్యాఖ్యానించవచ్చు. కాని ఆ సిద్ధాంతాన్ని, దాని తాలూకు న్యూరాసిస్‌ని అధిగమించిన అస్తిత్వ సత్యం దయానిధిపాత్రలో అభివ్యక్తమైంది. దయానిధి వ్యవస్థతో పడ్డ సంఘర్షణ స్వరూపం యిలా ఉంది - పుట్టుకతో అంగవైకల్యం కలిగిన వ్యక్తి తనకు అంగవైకల్యం లేదనీ, తను అందరిలానే ఉన్నాననీ నమ్మటానికి ఎంతగా ప్రయత్నించినా అడుగడుగునా ఆ కఠినసత్యం గుర్తువస్తూనే ఉంటుంది. చివరికి ఆ విషయాన్ని మనస్పూర్తిగా అంగీకరించి ''అంగవైకల్యం ఉంటేనేం? నేనూ మనిషినే'' అన్న ఆత్మవిశ్వాసానికి రాగలిగినప్పుడు తనతో తను సమాధాన పడటం జరుగుతుంది. దయానిధి సమస్య యిలాంటిదే. అతని తల్లి పతివ్రత కాదు. ఇది పోగొట్టుకోవడానికి వీల్లేని మచ్చ. భార్య ప్రవర్తన సరిగా లేకపోతే విడాకులిచ్చి సంబంధం లేదనవచ్చు. కాని తల్లి అటువంటి వ్యక్తి అయినప్పుడు, అది పుట్టుకతో వచ్చే అంగవైకల్యం వంటిది. దయానిధి చివరకు పతిత అయిన కోమలిని స్వీకరించడంతో తనతో తాను సమాధానపడి శాంతిని సాధిస్తాడు. ఈ స్వీకరించడం భార్యగా కాదు, ప్రేయసిగా కాదు, ఉంపుడుగత్తెగా కాదు. మనిషిని మనిషిగా. దయానిధి అన్వేషణలో, చేరిన గమ్యంలో, వ్యవస్థలో యిమిడే సంగతులు లేనేలేవు. వ్యవస్థతోడి సంఘర్షణే అతణ్ణి గమ్యం చేర్చింది. సౌందర్యమూ, సౌశీల్యమూ, అభిజాత్యమూ ఏమీలేని కోమలి ఎందుకు తనని అందరికంటె ఎక్కువగా ఆకర్షిస్తున్నదో దయానిధికి అర్థంకాదు. అది శారీరకమైన వాంఛ అని తోచినా నిజానికి అదీ కాదు. నవల మొదట్లో దయానిధికి కోమలి అందుబాటులో ఉన్న క్షణాల్లో కూడా శరీరం తనతో యిలా అంటున్నట్లు తోస్తుంది: ''ఇది అన్యాయం, నేనీ పనిచెయ్యలేను, నేనే సౌందర్యం, నన్ను నేను ధ్వంసం చేసుకోలేను. ఇతరులనీ ధ్వంసం చెయ్యలేను, నన్నొదిలెయ్యి''. నవల చివర ఆత్మపరీక్ష చేసుకున్న దయానిధి యిలా అంటాడు. ''చూడు కోమలీ, నాకు ప్రేమంటే ఏమిటో యింతవరకు తెలిసింది కాదు. అందరిలాగా, శరీర వాంఛనే ప్రేమనుకొని నన్ను నేను దగాచేసుకొనలేను. ఇతరులు ఎవ్వరితోనూ ఏ ఒక్కరితోనూ పంచుకోలేనిది నా ప్రేమ. అదొక దృష్టి-జీవితం అంతటినీ, తుదీ మొదలూ, ముందూ వెనకా అన్నింటినీ దూరంగా చూచి అర్థం చేసుకునే, ప్రపంచంపై ఒకచూపు.... నీతో స్నేహంవల్ల ఆ దృష్టి పోతుంది'' అంటాడు. దయానిధి తన ఏకాంతానికి తన అస్తిత్వానికి ప్రాథమిక విలువ యిస్తున్నాడు. శరీర వాంఛకూ ప్రేమకూ తనదైన నిర్వచనాన్ని యిస్తున్నాడు. ఈ నవలలో 'అస్తిత్వం' ప్రధానంగా, సహజంగా జీవించే పాత్ర

అమృతం. నవల చివర రచయిత గుర్తించిన సత్యం ''ఏ ఒక్కరి పరిస్థితులూ బుద్ధివికాసాలూ మరొకరికి రావు. ఐనా వాళ్ళందరినీ ఒక ఫక్కీలో నడచుకోమనడమే మన దౌర్భాగ్యం... మనం ముక్కలై ''నువ్వూ' 'నేనూ' అయి ఉత్తర దక్షిణాలకు ప్రయాణం చేసింది. 'అందరూ' మాత్రం లేరు. ఇది వ్యక్తి విశిష్టతను గుర్తించడం. ''చివరికి మిగిలిందేమిటి?'' అనే ప్రశ్నకు ''తనతో తను సమాధానపడటం - అదే మిగిలింది'' అని జవాబు. ''ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ మనిషినీ స్నేహపాశంలో బంధించి వేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూచినప్పుడు ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించగలం. కాని ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఈ జీవిత రహస్యం - దాన్ని తెలుసుకోవడానికి మానవుడు చేసే యత్నం - ఏ గొప్ప గ్రంథానికైనా యివి పునాది. ఈ నవలకీ అదే పునాది'' అంటూ రచయిత చెప్పుకున్న ముందు మాటలో అస్తిత్వవాద దృక్పథమే అభివ్యక్తమైంది.

1961లో గోపీచంద్ 'మెరుపుల మరకలు' అనే నవల వచ్చింది. అస్తిత్వ వాదదృక్పథం ఆధారంగా జీవితాన్ని పరిశీలిస్తూన్నట్లు నవలలో ఒకచోట చెప్పుకున్నారు కూడా. ఉషారాణి విశిష్టవ్యక్తిత్వ చిత్రణమే ఈ నవల వస్తువు; నైతిక వ్యవస్థదృష్ట్యా చూస్తే, ఉషారాణి వ్యభిచారిణి. ఆమెను మనోవైజ్ఞానిక శాస్త్ర దృష్ట్యా చూస్తే ఆమె 'nymphomaniac' అనాలి. కాని నిజానికి ఆమెలో mania - పిచ్చి న్యూరాసిస్ వంటి లక్షణాలేవీ లేవు. ఆమె నిజాయితీ, సాహసం, ఆమె ప్రియుల్నే కాదు, పాఠకుల్ని కూడా ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఆమె పోయిన పోకడలో ఆత్మవిశ్వాసం, స్వచ్ఛంద ప్రవృత్తి, స్నేహం, అప్యాయత ద్యోతకమౌతాయి. ఆమె అన్వేషణ వైరాగ్యంలో పర్యవసించిన క్షణంలోకూడా బాధ్యతతో భర్త దగ్గరకు వచ్చి, తన గత జీవితాన్ని దాపరికం లేకుండా చెప్పి క్షమాపణ కోరి సెలవు తీసుకుని ఆధ్యాత్మిక జీవితం గడపటానికి వెళ్ళిపోతుంది. ఉషారాణి స్వధర్మం సెక్స్ ప్రవృత్తితో ప్రారంభమై తన అస్తిత్వానికి అర్థం ఏమిటి? తనెందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నది? అనే ప్రశ్నలతో ఒక కొలిక్కి వచ్చి, అస్తిత్వపు ఏకాంతం నుంచి భగవత్తత్వమువైపు పయనిస్తుంది.

ఈ నవలలో ఒక ఆకర్షణీయమైన సన్నివేశం ఉషారాణికి చక్రవర్తి తర్వాత శ్రీకాంత్ తో ఏర్పడిన స్నేహాన్ని గూర్చి చక్రవర్తి ఈర్ష్యతో ప్రవర్తించి ప్రశ్నించినప్పుడు ఆమె అతనికిచ్చిన సమాధానాలూ, అతణ్ణి పసిపిల్లవానిలా సాంత్వనపరచడమూ. ఇక్కడ చక్రవర్తి తనకు ఉషారాణిపట్ల అనన్య సామాన్యమైన ప్రేమ ఉన్నదన్నప్పుడు, ''అభిప్రాయాలు వెలిబుచ్చడా నికేం? శ్రీకాంత్ కూడా అలానే అంటాడు'' అంటుంది ఉషారాణి. ''మా యిద్దరికీ ఉన్న తారతమ్యం నీ మనస్సుకు తెలీదా'' అని ప్రశ్నిస్తాడు చక్రవర్తి. ''తెలీదు'' అంటుంది ఉషారాణి. మాటల్లో బహిరుపాధుల్లో నిరూపితమయ్యే సత్యం స్థూలంగానే ఉంటుంది. వాటికందని వైవిధ్యం, వైశిష్ట్యం వ్యక్తి అంతర్యానికి సంబంధించినది. అది మరొకరికి సానుభూతిద్వారా తప్ప అందుబాటులో ఉండదు. వ్యక్తి అంటే కేవలం ఏకాంతం. వాచ్యంగా కాక సాహిత్యంలో పాత్రచిత్రణ ద్వారా, ధ్వని రూపేణా సూచించగలిగిన ఒకానొక వ్యక్తి అస్తిత్వం కూడా సానుభూతి ద్వారానే గ్రాహ్యం. దాన్నే 'సహృదయత' అంటారు.

(వచ్చే సంచికలో)

# సంస్కృత రూపకములు

## పరిచయ పట్టిక

డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు
(తెలుగు నాటక వికాసము)

### అశ్వఘోషుడు :

మనకు లభించిన ప్రథమ సంస్కృతరూపకము అశ్వఘోషుని 'శారిపుత్ర (లేదా శారద్వతీ పుత్ర) ప్రకరణము'. దీనియందలి కొన్నిభాగములు మాత్రమే మధ్య ఆసియాలో లభ్యమైనవి. ఇది నవాంకయుత మనియు, అశ్వఘోష విరచితమనియు రూపకాంతమున కలదు. శారిపుత్ర-మౌద్గల్యాయనులకు బుద్ధుడు ధర్మదీక్ష నొసంగుట ఇందలి ఇతివృత్తము. ఈ ప్రకరణమునందు నాట్యశాస్త్ర సూత్రములు చక్కగా పాటింపబడినవి. అశ్వఘోషుడు క్రీ.పూ. ప్రథమ శతాబ్దియందుండెనని విశ్వసింపబడుచున్నది. కాగా, అప్పటికే సంస్కృత రూపక రచన సుప్రతిష్ఠితమైనదన్నమాట. శారిపుత్రప్రకరణము లభించిన వ్రాతప్రతియందే మరి రెండు రూపకముల శిథిలభాగములుకూడ కలవు. బహుశః ఇవియును అశ్వఘోషునివే కావచ్చును. అవి అత్యల్పభాగము లగుటచేత 'కథాపరిణామము తెలియుటలేదు. ఒకదాని యందు బుద్ధి, ధృతి, కీర్తివంటి సాంకేతికపాత్రలు కలవు; ఇది ప్రబోధచంద్రోదయము వంటిది. ఇంక రెండవదది ఇంచుమించుగా మృచ్ఛకటికమును పోలియున్నది.

### భాసుడు :

కాళిదాసాదులచేత ఉత్తమరూపక రచయితగా ప్రశంసింపబడినవాడు భాసుడు. కాని, 1912లో శ్రీ పి. గణపతి శాస్త్రిగారు భాసనాటకచక్రమందలి కొన్ని రూపకములను ప్రకటించు వరకును భాసకృతులను ఆధునికు లెరుంగరు. కాళిదాసు క్రీ.శ. 4వ శతాబ్దివాడను నది బహుజన సమ్మతము. కావున, భాసుడంతకుముందే చాల ప్రసిద్ధినందియుండవలెను; అనగా క్రీ.శ. ఏ ప్రథమశతాబ్దికో చెందినవాడు అగును. శ్రీ గణపతిశాస్త్రిగారు ప్రకటించిన భాసనాటక చక్రమందు 13 రూపకములున్నవి - 1. దూతవాక్యము (వ్యాయోగము) 2. కర్ణభారము (వ్యాయోగము లేదా ఉత్సృష్టికాంకము) 3. దూతఘటోత్కచము (వ్యాయోగము లేదా ఉత్సృష్టికాంకము) 4. ఊరుభంగము (ఉత్సృష్టికాంకము) 5. మధ్యమవ్యాయోగము (వ్యాయోగము) 6. పాంచరాత్రము (సమవకారము) 7. అభిషేకము (నాటకము) 8. బాలచరితము (నాటకము; నాయికలేదు) 9. అవిమారకము (నాటకము) 10. ప్రతిమ (నాటకము) 11. ప్రతిజ్ఞాయౌగంధరాయణము (నాటిక) 12. స్వప్నవాసవదత్తము (నాటకము) 13. చారుదత్తము (ప్రకరణము).

నాట్యశాస్త్ర సూత్రములకు విరుద్ధములైన పెక్కు ఘట్టములు భాసనాటకములందున్నవి. అందుచే కొన్నింటిని ఫలాని రూపకములని ఖచ్చితముగా చెప్పుటకు వీలులేదు. ఈ సూత్రోల్లంఘనమును బట్టి భాసుడు నాట్యశాస్త్ర రచనకు పూర్వుడని కొందరును,

తెలిసియే ఉల్లంఘించెనని కొందరును వాదించుచున్నారు. ఈ రూపకములందు భాసుడు తన పేరెచ్చటను చెప్పుకొనలేదు. అందుచే ఇవి భాసకృతములే కావని కొందరును, కొన్ని మాత్రమే భాసకృతములు కావని కొందరును తలంచుచున్నారు. కాని, భాసుడు ప్రసిద్ధరూపక కర్త అనుట నిర్వివాదాంశము. భాసుని 'ఊరుభంగము' విషాదరూపకమున కొక ఉదాహరణ మని నిరూపించుటకు కొందరు విమర్శకులు ప్రయత్నించిరి. భాసనాటకములలో కథాగమన మందలి వేగము, చక్కని పాత్రపోషణము, సరళమైన భాష, ప్రదర్శనయోగ్యత అనునవి ముఖ్యలక్షణములు. పాంచరాత్రము తప్ప తక్కిన భారతనటాకములన్నియును ఏకాంక ములే. భాసుని నాటకము లన్నింటిలోను స్వప్నవాసవదత్తమును ఉత్తమనాటకమందురు. భాసుడు దాక్షిణాత్యుడై యుండవచ్చును.

## కాళిదాసు :

కాళిదాసు కాలమునుగూర్చి జగద్వితమే. మాళవికాగ్ని మిత్రము (నాటకము). విక్రమో ర్వశీయము (ఔత్తరాహులు దీనిని త్రోటకమనగా దాక్షణాత్యులు దీనిని నాటకముగానే పరిగణించిరి). అభిజ్ఞాన శాకుంతలము (నాటకము) అనెడి మూడు రూపకములను వరుసగా రచించెను. (ప్రసిద్ధి సంస్కృత రూపక కర్తలలో పెక్కురు మూడేసి రూకపములనే రచించియుండట విచిత్రవిషయము). పై మూడింటిలోను అభిజ్ఞానశాకుంతలము ఉత్తమో త్తమ రూపకము; ప్రాచ్య-పాశ్చాత్య విమర్శకులందరి మన్ననలను పొందినరూపకమిది. కాళిదాసుని కళాప్రతిభ సాటిలేనిది; 'కవికుల గురువు'గా కీర్తింపబడిన వాడితడు. ఇత డుజ్జయినీ నగరవాసియని విమర్శకుల అభిప్రాయము.

## శూద్రకుడు :

మృచ్ఛకటిక రచయితగా శూద్రకుడు మనకు సుపరిచితుడు. కాని, శూద్రకుడొక కల్పితపురుషుడనియు, ధావకభాసుడను నాతడే మృచ్ఛకటికమును రచించెననియు విమర్శ కుల అభిప్రాయము. మృచ్ఛకటికము క్రీ.పూ. 3,2 శతాబ్దములనాటి రచన అనియు, భాసుని చారుదత్తము దీనికి సంక్షిప్తరూపక మనియు, మనకు లభించిన ప్రథమ సంస్కృతరూపక మిదియే యనియు కొందరు విమర్శకుల అభిప్రాయము. కాని, మృచ్ఛకటికము క్రీ.శ. 6,7 శతాబ్దములనాటిదని శ్రీ కర్మార్కర్ ప్రభృతులు నిరూపించియున్నారు.

మృచ్ఛకటికము భాసుని చారుదత్తముకంటె చాల విశిష్టమైనది. దీనికి సంస్కృత రూపక ములందొక ప్రత్యేక స్థానము కలదు. అభిజ్ఞాన శాకుంతలము, ఉత్తమరామచరితము, మృచ్ఛక టికము అనునవి మూడును సంస్కృతరూపక ప్రపంచములో మూడు విశిష్ట స్థానములను ఆక్రమించుకొని యున్నవి. మొదటి రెండింటిలోను అతిలోక విషయములకు కూడ తావున్నది. కాని, మృచ్ఛకటికము కేవలము సాంఘికమైనది. ఉత్తములు, రాజులు, దొంగలు, జూదరులు, ధూర్తులు, విప్లవకారులు, బిచ్చగాండ్రు, రాజోద్యోగులు, సోమరులు, రక్షభ టులు, దాసీలు, వేశ్యలు మొదలగువారు స్వేచ్ఛగా విహరించిన విచిత్రప్రపంచమిది; అయినను నిష్కల్మషమైన ప్రేమ, విశ్వాసము అనునవి మూర్తీభవించిన లలితప్రపంచమిది. 'మృత్ శకటికము' (మట్టిబండి). ఇందు నాయకుని కష్టములకు కారణమై ప్రాధాన్యమును వహించు టచేత ఇది 'మృచ్ఛకటికము' అనబడినది. మృచ్ఛకటికము ఉత్తమమైన కవిత్వమునకు కూడ ప్రసిద్ధికెక్కియున్నది. (అసంపూర్ణము)

# కొత్త రుచులు
# ఆప్కో చేనేతలు

విశిష్టమైన రూపకల్పనల్లో నాణ్యమైన
చేతి అద్దకపు అద్భుతాలు

ఈ తరుణంలో
మీ అభిరుచులకు అనుగుణంగా ఎన్నెన్నో రకాలు
అదునాతనమైన నేతల్లో సాంప్రదాయపు సొంపుల్లో
కళ్లు జిగేలుమనిపిస్తాయి.

అన్ని సందర్భాలలో సరిపోయే సరికొత్తరకాల్లో

## ఆప్కో చేనేతలు

అపూర్వ కళా ఖండాలనుబోలు
గుంటూరు, గద్వాల, వెంకటగిరి జరీ చీరలు;
సిద్ధిపేట, ఉప్పాడ, కొత్తపల్లి, బుటా చీరెలు, పుట్టపాక, నారాయణపేట, ధర్మవరం, పోచంపల్లి టై అండ్ చీరెలు, దుప్పట్లు, తువాళ్లు, లుంగీలు, ధోవతులు, మరెన్నో చేనేతలు

సామాన్య కుటుంబీకులకు పనికివచ్చే చీరెలు, ధోవతులు చౌక ధరలలో
కంటికింపైన డిజైన్లలో పాలియెస్టర్ చొక్కాలు

## మీకు దగ్గరలోగల ఆప్కో ఫ్యాబ్రిక్స్

విక్రయశాలను నేడే దర్శించండి

''సులభ వాయిదాలపై అరువు సౌకర్యంగలదు''

ది ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూం వీవర్స్
కో ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్,
హైదరాబాదు-500 029.

MISIMI/మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191


# "అన్ని బ్యాంకులకన్నా వడ్డీ మిన్న ఆప్కాబ్ అందించే పొదుపు పథకాలలో"

## 46 రోజులకు 11.25%

కాలపరిమితి ధరావతులపై ఆప్కాబ్ అందిస్తున్న వడ్డీరేట్లు
(01-3-1993 నుంచి అమలులో)

| కాలపరిమితి | వడ్డీరేటు |
|---|---|
| ★ 46 రోజుల నుండి 270 రోజుల వరకు | 11.25 |
| ★ 271 రోజుల నుండి 1 సం. లోపు | 11.00 |
| ★ ఒక సంవత్సరము ఆపైన | 11.25 |
| సేవింగ్స్ బ్యాంక్ ఖాతా | 6.25% |

ఆప్కాబ్‌లో ఉన్నాయి పెట్టుబడికి, పొదుపుకు అనేక పథకాలు. ★ గృహలక్ష్మి డిపాజిట్ స్కీమ్ ★ స్వర్ణఫల డిపాజిట్ స్కీమ్ ★ మారేజి డిపాజిట్ స్కీమ్ ★ హయ్యర్ ఎద్యుకేషన్ డిపాజిట్ స్కీమ్ ★ క్యాష్ సర్టిఫికెట్ స్కీమ్ ★ బాలసహాయ డిపాజిట్ స్కీమ్ ★ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ★ పెన్షన్ డిపాజిట్ స్కీమ్ సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్ ★ ఎన్.ఆర్.ఐ. (రు) మరియు ★ హోమ్‌లోన్ అక్కౌంట్.

APCOB

**ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి॥.**

(షెడ్యూల్డ్ బ్యాంకు)
ట్రూప్ బజార్, హైదరాబాదు
ఫోన్: 44481, 44482, 44483

బ్రాంచీలు: విద్యానగర్ 615192 ★ మలక్‌పేట్ 528983 ★ నారాయణగూడ 664909 ★ విద్యుత్ సౌధ 220378 ★ సికింద్రాబాద్ 76172 ★ సైదాబాద్ కాలనీ 877401 ★ బౌద్ధనగర్ 865518 ★ హిమాయత్ నగర్ 232837 ★ తార్నాక 869351 ★ మాసాబ్‌టాంక్ 225451 ★ దిల్‌సుక్‌నగర్ 875539 ★ చార్మినార్ 524161 ★ బాగ్‌లింగంపల్లి 668944 ★ రోతుకుంట 845527 ★ తార్నాక బ్రాంచ్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ (ఎపిడిడిసియస్ ఆవరణలో) 869308 ★ తిరుపతి 22428.

**సదా మీ క్షేమాన్ని కాంక్షించే బ్యాంక్ ఆప్కాబ్**

(భారతీయ రిజర్వు బ్యాంకు వారి ఆదేశాల మేరకు అన్ని రేట్లు రివిజన్‌కు లోబడి ఉంటాయి.)